ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 6 ఫిబ్రవరి 2025 | 5







పుష్పక వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం

వైభవంగా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహుని దివ్యకల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల రెండో రోజైన బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గరుడ పుష్పక వాహనంపై స్వామి వారు ఊరేగారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి విచ్చేశారు. రాత్రి 7 గంటలకు పుష్పక వాహనంపై గ్రామోత్సవం జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. - ఆర్జో

సంప్రదాయ నృత్య ప్రదర్శన.. (పైన) గిరిజన నృత్యం చేస్తున్న గోరంట్ల, వీసీ తదితరులు



నన్నయలో ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవం

హాజరైన ఎమ్మెల్యే గోరంట్ల, వీసీ

400 మంది గిరిజన కళాకారులు, 1500 మంది ప్రతినిధులు హాజరు - ఆర్జో



టమోటా ఢమాల్!

» గణనీయంగా తగ్గుతున్న ధరలు.. స్థానిక ఉత్పత్తులతో డౌన్

» మదనపల్లి, అనంతపురం నుంచి దిగుమతులకు బ్రేక్

» బహిరంగ మార్కెట్లలో కిలో రూ.20, రైతుబజార్లలో రూ.14

టమోటాకు ... 'లోకల్' నాటు దెబ్బ బలంగా తగులుతోంది. కొద్దిరోజుల నుంచి ధరలు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈ ధరలు మరింత తగ్గొచ్చని కూడా రైతులు, వ్యాపారులు అంచనా వేస్తున్నారు. గత వారం పది రోజులుగా లోకల్ సరుకు ఊపందుకోవడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

(ఆంధ్రజ్యోతి- రాజమహేంద్రవరం అర్బన్)

లోకల్ సరుకు భారీగా రావడంతో ఇతర జిల్లాల నుంచి టమోటా దిగుమతులు తగ్గిపోయాయి. ఇక్కడే రేటు తక్కువగా ఉంటే బయట నుంచి సరుకు తీసుకొచ్చి ఏం చేయాలనే భావనతో హోల్‌సేల్ వ్యాపారులు చాలామంది దిగుమతులు నిలిపివేసినట్టు చెబుతున్నారు. టమోటాలకు చిత్తూరు జిల్లా మదనపల్లి, పరిసర ప్రాంతాలు, అనంతపురం జిల్లాలోని కొన్ని ఏరియాలు పెట్టింది పేరన్న సంగతి తెలిసిందే. ఇంచుమించు ఏడాది పొడవునా అక్కడి నుంచే టమోటా మార్కెట్లకు వస్తుంటుంది. మధ్య మధ్యలో బెంగళూరు టమోటాలు వచ్చినా ధరల్లో పెద్ద తేడా కనిపించదు. అక్కడి నుంచి దిగుమతయ్యే టమోటాలకు లోకల్ మార్కెట్లలో కిలో రూ.30-రూ.40 పైనే ధర ఉంటుంది. అయితే ఇప్పుడు సీన్ పూర్తిగా రివర్స్ అయ్యింది. లోకల్ టమోటా మార్కెట్లను ముంచెత్తడంతో మదనపల్లి, అనంతపురం ప్రాంతాల టమోటాలకు డిమాండ్ పడిపోయింది. అక్కడి నుంచి టమోటా లోడులు తీసుకురావడానికి సైతం ఇక్కడి వ్యాపారులు భయపడుతున్నారు. ఒకరిద్దరు మినహా హోల్‌సేల్ వ్యాపారులు చాలామంది టమోటా దిగుమతులు నిలిపేసినట్టు చెబుతున్నారు.

● గణనీయంగా తగ్గుతున్న ధరలు

లోకల్ టమోటా అందుకోవడంతో ధరలు రోజురోజుకూ గణనీయంగా పడిపోతున్నాయి. ఇటీవలి కాలంలో ఎన్నడూలేనంతగా బహిరంగ మార్కెట్లో కిలో రూ.20కు టమోటా ధర పతనమైంది. రైతుబజార్లలోనూ కిలో రూ.14లకే దొరుకుతున్నాయి. ఇవి కూడా మంచినాణ్యతతో లభిస్తున్నాయి. నాణ్యత లేని సరుకు అయితే ఇంకాస్త తగ్గించి మరీ అమ్మేస్తున్నారు. లోకల్ నాటు టమోటాలు మార్కెట్లోకి భారీగా రావడంతో వినియోగదారులు వీటినే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోని సీతానగరం మండలం, కడియం మండలంలోని అనేక ప్రాంతాల్లో టమోటాలను పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం పూర్తిగా అనుకూలంగా ఉండడంతో ఇక్కడి నుంచి దిగుబడులు పెరిగాయి. మడికి, రావులపాలెంలంక ప్రాంతాల నుంచి టమోటా భారీగా వస్తోంది.

● టమోటా సూప్‌లు ... నిల్వ పచ్చళ్లు

ధరలు భారీగా తగ్గడం, మంచి నాణ్యత కలిగిన టమోటాలు దొరుకుతుండడంతో చాలామంది గృహిణులు నిల్వపచ్చళ్లతో బిజీగా ఉన్నారు. ఇక పప్పు టమోటా కూరలు చాలామంది మెనూలో చేరింది. మరికొంతమంది టమోటా సూప్‌లను ఆస్వాదిస్తున్నారు. మరోపక్క హోటళ్లు, కర్రీపాయింట్లలోనూ టమోటా కాంబినేషన్‌తో అనేక కూరలు రెడీ చేస్తున్నారు. రైతుబజార్లలోనూ మంచి నాణ్యతతో ఒక్క మచ్చ కూడా లేకుండా లోకల్ టమోటాలు అందుబాటులో లభించడంతో చాలామంది ఎగువ మధ్యతరగతి, ధనిక వర్గాలు కూడా రైతుబజార్లకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితి మరో నెల రోజులపాటు ఉండొచ్చని, ఎండలు పెరిగి వాతావరణం మారితే దిగుబడులు తగ్గి క్రమంగా ధరలు పెరిగే ఛాన్స్ ఉంటుందని వ్యాపారులు, రైతులు చెబుతున్నారు.



జిల్లాలో ఆర్అండ్‌బీ రోడ్లకు మోక్షం

రూ.22.66 కోట్లతో మొత్తం 99 గుంతల పూడ్చివేత లక్ష్యం

ఇప్పటికే 55 పనులు పూర్తి : జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దుర్భరంగా మారిన ఆర్అండ్‌బీ రోడ్లకు ఎట్టకేలకు మోక్షం కలుగుతోంది. మొత్తం జిల్లాలో 531.6 కిలోమీటర్ల మేర 99 గుంతలు పూడ్చడానికి రూ.22.66 కోట్లతో పనులు చేపట్టగా, ఇప్పటికే రూ.10.57 కోట్లతో 55 పనులు పూర్తిచేసినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈమేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన జారీచేశారు. ఈనెల 15వ తేదీకి మొత్తం పనులు పూర్తి చేయనున్నట్టు తెలిపారు. రాజానగరం నియోజకవర్గంలో 138.4 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.5.57 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే 83.31 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో 119.246 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.5.88 కోట్ల నిధులు మంజూరుకాగా, ఇప్పటికే 97.330 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయన్నారు. అనపర్తి నియోజకవర్గంలో 82.592 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ3.39 కోట్ల నిధులు మంజూరుకాగా, ఇప్పటికే 71.972 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయన్నారు. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలో 4.695 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.29 లక్షల నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే నూరుశాతం పనులు పూర్తయ్యాయన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో 13.4 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.74 లక్షల నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే 4 కిలోమీటర్ల మేర పూర్తయ్యాయన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో 37.961 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.1.67 కోట్ల నిధులు మంజూరవ్వగా, 26.721 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 51.598 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ2.94 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే 40.048 కిలోమీటర్ల మేర పూర్తయ్యాయన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 82.158 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.2.17 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే 45.400 కిలోమీటర్ల మేర పూర్తయ్యాయని ఆమె తెలిపారు.

వచ్చే నెల 1 నుంచి ఇంటర్, 17 నుంచి పది పరీక్షలు

» ఇంటర్‌కు 51, పదో తరగతికి 134 సెంటర్లు

» పకడ్బందీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మార్చి 1వ తేదీ నుంచి 20 వరకూ ఇంటర్మీడియట్, 17 నుంచి 31 లేదా ఏప్రిల్ 1 వరకూ పదో తరగతి వార్షిక పరీక్షలు ఉంటాయని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఇంటర్ ఉదయం 9 గంటల నుంచి, పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి నిర్వహిస్తారన్నారు. ఈమేరకు సమన్వయ శాఖల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతరం విద్యుత్తు సరఫరా ఉండాలని, సెక్షన్ 144 అమలుచేయాలని, మెడిసిన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో ఇంటర్ 43,754కి 51, పదో తరగతి 25,723 మంది విద్యార్థులకు 134 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను గంట ముందుగానే అనుమతించడం జరుగుతుందని, ఒక్క నిమిషం ఆలస్యమైనా ప్రవేశం ఉండదని ఆమె వెల్లడించారు. సమావేశంలో అదనపు ఎస్పీ మురళీకృష్ణ, డీఆర్వో టి.సీతారామమూర్తి, డీఈవో వాసుదేవరావు, ఆర్ఐవో నరసింహం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కి 138 మంది గైర్హాజరు

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 138 మంది విద్యార్థులు బుధవారం గైర్హాజరయ్యాయని ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. జిల్లాలో 12 సెంటర్లలో ఈ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించగా మొదటి ఏడాది 727, రెండో ఏడాది విద్యార్థులు 665 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

మద్యం షాపులకు గడువు పెంపు

కొవ్వూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యంషాపులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 8వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు కొవ్వూరు ఎక్సైజ్ సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో చాగల్లు మండలంలో 1, తాళ్లపూడి మండలంలో 1 షాపు ఏర్పాటుచేసుకోవడానికి ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీ (శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. 9న దరఖాస్తుల పరిశీలన, 10న కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడ్రా నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు కుల, స్థానిక ధ్రువీకరణలు సమర్పించాలని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామానాయుడు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోండి

» నగరంలో 17,286 ఓట్లు » ప్రతీ 30 ఓట్లకు ఒకరిని బాధ్యులు చేయండి

» రాజమహేంద్రవరం అర్బన్ చాలా కీలకం » 'పేరాబత్తుల' గెలవాలి

» జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను చాలా సీరియస్‌గా తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం 1వ డివిజన్ పరిధిలోని జాతీయ రహదారి సమీపంలో మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ కార్యాలయం వద్ద బుధవారం రాత్రి సిటీ నియోజకవర్గ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో జరిగిన సమావేశానికి మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ గతంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లోని ఎమ్మెల్సీ ఎన్నికల్లో మనమే గెలిచాం కాబట్టి ఈ దఫా ఎన్నికల్లో బాగా కష్టపడి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తులను గెలిపించాలన్నారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 100 శాతం స్ట్రైకరేట్‌తో ఎలా గెలిచామో.. అదే స్థాయిలో రాజశేఖర్ గెలవాలని అన్నారు. ఉభయగోదావరి జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో అత్యంత ముఖ్యమైన నియోజకవర్గం రాజమహేంద్రవరం అర్బన్ అని, ఇక్కడ 17,286 ఓట్లు ఉన్నాయన్నారు. ఇక్కడ ప్రత్యేక దృష్టిపెట్టాలని, అర్బన్‌లో ఓటర్ల జాబితాలో ఓటర్ల చిరునామాలు వీధుల పేరుతో, గ్రామాల్లో వార్డుల పేరుతోను ఉంటాయి కాబట్టి వాటిని గుర్తించడం సులభతరం అవుతుందన్నారు. రాజమహేంద్రవరంలో ఉన్న ఓటర్ల జాబితాను డివిజన్ల వారీగా సర్దుబాటు చేసుకుని ఒక జాబితా తయారుచేసుకుని 30 ఓట్లకు ఓ బాధ్యుడిని పెట్టుకోవాలన్నారు. ఇలా 600మంది పైబడి బాధ్యులను పెట్టుకోవాలన్నారు. అంతా క్షేత్రస్థాయిలో పనిచేయాలని, ప్రత్యేకమైన శ్రద్ధతో ఎవరి 30 ఓట్లు వాళ్లే చూసుకుంటే సరిపోతుందన్నారు. ఈ ఓట్లలో పాజిటివ్, నెగిటివ్ ఓట్లు గుర్తించుకోవాలని, పాజిటివ్ ఓట్లు 100 శాతం పోల్ అయ్యేవిధంగా కృషి చేయాలన్నారు. నెగిటివ్‌గా ఉన్న ఓటర్లకు అవగాహన కల్పించాలని, అలాగే బ్యాలెట్‌లో ఓటు వేసేటప్పుడు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, వరుస నెంబరులో పేరాబత్తుల రాజశేఖర్ పేరు ఎదురుగా ఉన్న గడిలో 1 నెంబరు వేయాలని చెప్పారు. అది కూడా పోలింగ్ బూత్‌లో సిబ్బంది ఇచ్చే పెన్నునే వినియోగించాలని, గడిలో నెంబరు మాత్రమే వేయాలని తెలిపారు. రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సమర్థవంతమైన నాయకుడని, ఆయన నేతృత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలిసికట్టుగా పేరాబత్తులను గెలిపించాలన్నారు. ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల గెలుపే లక్ష్యంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. గత ఎనిమిది నెలల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుతోనే పేరాబత్తుల గెలుస్తారని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, పరిశీలకులు బోళ్ల వెంకటకృష్ణ ప్రసాద్ , మాజీ మంత్రి కేఎస్ జవహర్, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు మరో నామినేషన్

ఏలూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బుధవారం ఒక నామినేషన్ దాఖలైంది. ఇప్పటికి వరకు మొత్తం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు జిల్లా నుంచి భీమడోలుకు చెందిన గుండుమోలు బాలాజీ బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ నెల 10 వరకు మాత్రమే నామినేషన్ల దాఖలుకు గడువు ఉంది. దీంతో ఈనెల 6, 7, 10 తేదీలే ఇక అభ్యర్థులకు మిగిలాయి. 8, 9 తేదీలు సెలవు దినాలు కావడంతో నామినేషన్ల దాఖలకు ఆ మూడు రోజులే మిగిలి ఉన్నాయి. ఇటు ప్రధాన పార్టీల మద్దతు ఉన్న అభ్యర్థులు ఇంకా నామినేషన్లు దాఖలు చేయలేదు. వారు నామినేషన్లు వేస్తే రాజకీయ వేడి రగలనుంది.

జిల్లాలో 32 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం



ఎంఆర్‌పాలెంలో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు

కడియం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 32వేల ఎకరాల్లో 28 వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నారని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. బుధవారం మాధవరాయుడుపాలెంలో సర్పంచ్ అన్నందేవుల చంటి సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ సాగును మాధవరావు సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంటి తాను కొన్నేళ్లుగా ప్రకృతి వ్యవసాయ విధానాన్ని సాగు చేయడంతోపాటు ఈ ప్రాంత రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ ఎటువంటి పురుగుమందులు, ఎరువులు లేకుండా ఘనామృతం, జీవామృతాలను తయారుచేసి వాటి ద్వారా పండించే ప్రకృతి వ్యవసాయ విధానంతో రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడానికి వీలుందన్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లాలో 32 వేల ఎకరాల్లో సాగుచేస్తుండగా, కడియం మండలంలో 1800 మంది రైతులు 2800 ఎకరాల్లో సాగు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా ప్రకృతి వ్యవసాయానికి కషాయాలను పిచికారీ చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు కొత్త అగ్రిస్టాక్ రిజిస్ట్రేషన్లు

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన అగ్రిస్టాక్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో రైతులకు రిజిస్ట్రేషన్ ఎలా చేస్తున్నారో అనే విషయాన్ని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు బుధవారం రూరల్ మండలం రాజవోలులో పరిశీలించారు. రిజిస్ట్రేషన్ మరింత సులభతరంగా చేసేందుకు సిబ్బందికి సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాలకు రిజిస్ట్రేషన్ కచ్చితంగా రైతులు చేయించుకోవాలని, రైతులు రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌కార్డు, కొత్తగా వచ్చిన ఎల్పీ నెంబర్‌తో కూడిన 1బీ/పాస్‌బుక్ జిరాక్స్, రేషన్‌కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నెంబర్ తీసుకెళ్లాలన్నారు. రిజిస్ట్రేషన్ అయిన తరువాత 21 నంబర్ల ఐడీ రైతు మొబైల్ నెంబర్‌కు మెసేజ్ వస్తుందని, పీఎం కిసాన్‌కి ఈ ఐడీతోనే లబ్ధి ఉంటుందన్నారు.



ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) తూర్పుగోదావరి జిల్లా 2025 క్యాలెండర్‌ను కలెక్టర్ ప్రశాంతి ఆవిష్కరించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ, జిల్లాకార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్‌పాల్, జిల్లా ఉపాధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, పి.రవికుమార్, రాజమహేంద్రవరం నగరశాఖ అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు ఏ శ్రీనివాసరావు, లక్ష్మీప్రసన్న, అగ్రికల్చర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నేతలు హమీద్, మహ్మద్ ఖాజామొహిద్దీన్ పాల్గొన్నారు.





గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, తదితరులు , ఆలయంలో కొలువుదీరిన అష్టలక్ష్మీ విగ్రహాలు

వైభవంగా స్వామివారి గ్రామోత్సవాలు

- అంతర్వేదిలో కొనసాగుతున్న కల్యాణోత్సవాలు
- గరుడ, పుష్పక వాహనాల పై ఊరేగిన స్వామివారు
- ఆలయంలో ప్రత్యేక పూజలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- పెద్దసంఖ్యలో భక్తుల రాక





ఏర్పాట్లపై ఆలయ అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఐజీ అశోక్‌కుమార్

అంతర్వేది, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు రుద్రరాజు బంగారమ్మ వారిచే నిర్మితమైన గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిపారు. తొలుత స్వామివారిని అర్చకస్వాములు అలంకరణ చేసిన అనంతరం భక్తులు కొబ్బరి కాయలు కొట్టి హారతులు పట్టారు. గ్రామ పురవీధుల్లో స్వామి- అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించగా ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు పుష్పకవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. అనంతరం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కేరళ డప్పులతో వినూత్నరీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కుమారరామ గోపాల రాజా బహద్దూర్, సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, నల్లా సత్య కిరణ్ ప్రసాద్, వలవల రాంబాబు, ఉప్పుగంటి నాగ మల్లేశ్వరరావు (దత్తుడు), పోతురాజు వెంకటకృష్ణ, ఎస్‌ఐ కె.దుర్గాశ్రీనివాస్, వనమాలి మూలాస్వామి, కూటమి శ్రేణులు, అర్చకులు, వాహనకారులు, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు, పి.గన్నవరం, రాజోలు డెల్టా చైర్మన్లు గుబ్బల శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జి, నాయకులు ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, పోతురాజు కృష్ణ కొండ కిషోర్, వీర మల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల్లో భాగంగా నేడు..

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటల నుంచి 7 గంటల వరకు స్వామివారి తిరువారాధన, ఆర్జిత అభిషేకం, బాలబోగం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సుదర్శన హోమం, సాయంత్రం 4 గంటలకు హంస వాహన సేవ, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహణ, రాత్రి 7 గంటలకు శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవాలు జరుగుతాయని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

పటిష్ఠ భద్రతా చర్యలు

అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ బుధవారం విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేదపండితులచే మహదాశీర్వచనం జరిపించారు. అనంతరం కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరు బయట కల్యాణం అంతర్వేది పుణ్యక్షేత్రంలో జరుగుతున్నందున 1600 మంది పోలీసు యంత్రాంగం శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రధానంగా కల్యాణం, రథోత్సవం, చక్రస్నానం, స్వామివారి తెప్పోత్సవాల్లో ఎటువంటి తొక్కిసలాట జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసేందుకు పోలీసు యంత్రాంగం సన్నద్ధమైందన్నారు. కమాండ్ కంట్రోల్ రూము, వంద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తీర్థ మహోత్సవాల పర్యవేక్షణ జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ బీ.కృష్ణారావుతో కలిసి కల్యాణ మండపం, భక్తుల దర్శన క్యూలైన్, రథం రోడ్డు, పార్కింగ్ తదితర తీర్థ మహోత్సవ ప్రదేశాలను పరిశీలించి పలు సూచనలు అందించారు. అనంతరం కల్యాణ మండపం వద్ద ఎంతమంది భక్తులు కల్యాణాన్ని తిలకించేందుకు టికెట్లు కేటాయించారని ఆలయ అధికారులను అడగ్గా సూపరింటెండెంట్ పి.విజయసారథి మాట్లాడుతూ 1500 టికెట్లను సాధారణ భక్తుల కోసం అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. వన్‌వే రూటు, రవాణా సౌకర్యం, ఎల్‌ఈడీ స్క్రీన్లు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్,సీఐలు నరేష్‌కుమార్, భీమరాజు, ఎస్‌ఐ కె.దుర్గాశ్రీనివాస్, ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అడవితల్లి ముద్దుబిడ్డలు .. ఆదివాసీలు

- రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- 'నన్నయ'లో ఘనంగా ప్రారంభమైన జాతీయ గిరిజన మహోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి సంస్కృతీ వైభవాన్ని కాపాడుతున్న ఆదివాసీలు అడవి తల్లి ముద్దుబిడ్డలు అని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో బుధవారం ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనికి ఎమ్మెల్యే గోరంట్ల, వర్సిటీ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో గిరిజనులకు ఎన్టీఆర్ అందించిన సేవలను గుర్తుచేశారు. గిరిజన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలే లక్ష్యంగా శిక్షణ పొందాలని సూచించారు. వీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాలోని విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా నన్నయ వర్సిటీ ఆవిర్భవించిందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలు అందరికీ తెలియాలనే ఉద్దేశంతో ఏడాదికొకసారి ఓ విశ్వవిద్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు.టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిభాస్కర్, జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్పనాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడవత్ విష్ణునాయక్ మాట్లాడుతూ అడవిబిడ్డలుగా ఉన్న గిరిజనుల జీవనవిధానం ఒక ప్రత్యేక శైలిలో ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి 1500 మంది ప్రతినిధులు, 400 మంది కళాకారులు హాజరైనట్టు అక్కులప్పనాయక్ తెలిపారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ గిరిజనుల చరిత్ర సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన గిరిజన కళాకారులు థింసా, లంబాడీ, జానపద నృత్య ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. తొలుత వర్సిటీ చాళుక్యద్వారం నుంచి ఆడిటోరియం వరకు సాంప్రదాయ నృత్యప్రదర్శనలతో ఆదివాసీ కళాకారులు భారీ ప్రదర్శన నిర్వహించారు.

కార్యక్రమంలో టీఎస్ఎఫ్ నాయకులు విష్ణు, దొర, రాజకుమార్ రెడ్డి, భగవాన్, వెస్లీ, రఘు, జానపద కళాకారుడు భిక్షునాయక్, టీఎస్ఎఫ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మధులత, ఉపాధ్యక్షులు హేమలత, తెలంగాణ టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



వర్సిటీ చాళుక్య ద్వారం నుంచి సంప్రదాయ నృత్యాల ప్రదర్శన

పాలిటెక్నిక్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో
'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఆదిత్య వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి

గండేపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జనవరి 28, 29 తేదీల్లో జరిగిన 27వ రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీల్లో కాకినాడ జిల్లా గండేలపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ విద్యార్థులు ఐదు పతకాలు సాధించారని ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి బుధవారం తెలిపారు. బాలుర విభాగంలో కె.సాంబశివరావు షాట్‌పుట్‌లో గోల్డ్ మెడల్, డిస్కస్‌త్రోలో సిల్వర్ మెడల్, జి.అవినాష్‌కుమార్ 200 మీటర్ల పరుగులో సిల్వర్ మెడల్, బాలికల విభాగంలో వీఎల్ఎస్ కృష్ణతులసి షాట్‌పుట్‌లో గోల్డ్ మెడల్, డిస్కస్‌త్రోలో సిల్వర్ మెడల్, ఎస్‌కే సబీహా చదరంగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. మార్చిలో బెంగళూరులో జరిగే ఆలిండియా సౌత్‌జోన్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్‌కు అర్హత సాధించారు. విద్యార్థులను, వారికి తర్ఫీదునిచ్చిన పీడీలు సీహెచ్ మురళీ మోహన్, కె.శేఖర్‌రెడ్డిను సతీష్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంపై పోలీసులకు శిక్షణ



డ్రోన్ల వినియోగంపై శిక్షణను పరిశీలిస్తున్న కాకినాడ ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): డ్రోన్లను ఏవిధంగా వినియోగిస్తే సత్ఫలితాలను సాధించవచ్చో కాకినాడ జిల్లా వ్యాప్తంగా 97 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో రెండురోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బుధవారం ఎస్పీ మాట్లాడుతూ త్వరలో ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఒక డ్రోన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా డ్రోన్లను ట్రాఫిక్ నియంత్రణలో, శాంతి భద్రతల పరిరక్షణలో, ఊరేగింపులు, బహిరంగ సభలు, జాతరలు, పండుగుల, ఉత్సవాల్లో ఉపయోగించడం.. మరీ ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్, బహిరంగ మద్యపానం, జూదాలు, నాటుసారాయి పట్టుకోవడంలో ఉపయోగిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో కొంతమందితో డ్రోన్ ఆపరేట్ చేయించి వారి శిక్షణ సామర్థ్యాన్ని పరిశీలించారు. శిక్షణ పొందిన వారిని ఆయా స్టేషన్లలో డ్రోన్‌లు ఉపయోగించి విధులు నిర్వర్తించడానికి ఉపయోగించనున్నారు.

బెండపూడిలో ప్రకృతి
సాగు విధానంపై అధ్యయనం

- జీవామృతాల తయారీని పరిశీలించిన శ్రీలంక రైతుల బృందం



బెండపూడిలో జీవామృతం తయారీని పరిశీలిస్తున్న శ్రీలంక బృందం

తొండంగి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అధ్యయనం చేసేందుకు వచ్చిన శ్రీలంక రైతుల బృందం బుధవారం తొండంగి మండలం బెండపూడి విచ్చేశారు. తేజ అరవింద్ అనే రైతు పొలాన్ని రత్నశ్రీ, ప్రియదర్శిని సికురాజపతి, హర్షలాసంత, తిలక్ చందన, అనోమ సంజీవని, హసాంక పరిశీలించారు. 30 ఎకరాల్లోని కొబ్బరి తోటలో అంతర పంటలుగా సాగవుతున్న కోకో, వక్క, అరటిలను చూసి అబ్బురపడ్డారు. తేమ కోసం, భూమి సత్తువ కోసం నవధాన్యాల పచ్చిరొట్టను పెంచుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. పూర్తి ప్రకృతి విధానంలో తోటలోనే అవసరమైన సేంద్రియ ఎరువుల తయారీని చూశారు. జీవామృతం, బీజామృతం తయారీ విధానాన్ని రైతును అడిగి తెలుసుకున్నారు. వీటి వినియోగంతో సాగు ఖర్చు ఏ మేరకు తగ్గుతుందో వివరంగా అడిగారు. తోటకు డ్రిప్ ద్వారా జీవామృతాన్ని అందించడం అద్భుతమని, ఇప్పటివరకు తాము పరిశీలించిన ప్రాంతాల్లో ఇది మెరుగైన విధానమన్నారు. రైతులు, స్థానికులతో మాట్లాడి సేంద్రియ సాగు ద్వారా చేకూరుతున్న లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా కో-ఆర్డినేటర్ గణేష్, ఎంటీ గోవిందరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

దారి కాచి... అడ్డగించి

- సెల్ ఫోను, రూ. నాలుగు వేలు దోపిడీ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు సమీపం జాతీయ రహదారిలో గల జీరో పాయింట్ వద్ద ఒక వ్యక్తిపై ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే.... ఒడిశాకు చెందిన షకీలాద్దీన్ స్థానిక ఫ్రెండ్స్ దాబాలో సప్లయిర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 2వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో పని ముగించుకుని తాను నివాసముంటున్న దివాన్‌చెరువులోని రూమ్‌కు వస్తుండగా, జీరో పాయింట్ వద్దకు వచ్చేసరికి ఐదుగురు వ్యక్తులు బైక్‌లపై వచ్చి వెంబడించి, అతని జేబులో ఉన్న రూ. నాలుగు వేల నగదు, మొబైల్ ఫోన్ లాక్కుని పారిపోయినట్టు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకనైనా రాత్రిపూట గస్తీ ముమ్మురం చేయాలి.

వృద్ధుడి ఏటీఎం కొట్టేసి...
రూ.30 వేలు అపహరణ

- ప్రకాష్ నగర్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సుమారు 60 ఏళ్ల పైబడిన వృద్ధుడ్ని గుర్తుతెలియని ఓ వ్యక్తి అతన్ని ఏ మార్చి ఏటీఎం కార్డును తస్కరించాడు.

దీంతో రూ. 30 వేలును డ్రా చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రకాష్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరం నారాయణపురం సమీపంలోని సుబ్బారావు నగర్‌కు చెందిన టీ.నాగభూషణం అనే వృద్ధుడు గతనెల 7న లాలాచెరువు రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లి డబ్బులు తీసుకునే సమయంలో అక్కడే వున్న గుర్తుతెలియని వ్యక్తి మాటల్లో పెట్టి నాగభూషణం ఏటీఎం కార్డును మార్చేశాడు. దీన్ని గమనించని వృద్ధుడు తిరిగి ఇంటికి చేరుకున్నాడు. అయితే అతని బ్యాంక్ ఖాతాలోంచి గతనెలలోనే రెండు దఫాలుగా 30 వేలు నగదును సదరు గుర్తుతెలియని వ్యక్తి డ్రా చేశాడు. దీంతో బాధితుడు ప్రకాష్ నగర్ పోలీసులను బుధవారం ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5 (ఆం ధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం వడ్డి వీరభద్రరావునగర్‌లో ఒక ఇంట్లో గుట్టుగా వ్యభిచారం జరుగుతున్నట్టు బొమ్మూరు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సీఐ కాశీవిశ్వేశ్వరరావు తన బృందంతో వెళ్లి దాడులు నిర్వహించారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో సీఐ రైడ్ చేయగా, ఆ గృహంలో నిర్వాహకులు గుబ్బల వెంకటలక్ష్మి, ఆమె భర్త సత్యనారాయణ, ఇద్దరు విటులు, ఒక బాధిత మహిళను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడుల్లో పోలీసు సిబ్బంది ఉన్నారు.

వచ్చే నెల 8న జాతీయ లోక్ అదాలత్

- పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారని, మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సంబంధించిన కేసులను కూడా విచారిస్తారని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఆ రోజున రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రాపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట,ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో ఉదయం 10 గంటల నుంచి కేసుల విచారణ ఉంటుందన్నారు. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, ప్రమాద, బ్యాంకు కేసులు, రాజీపడదగిన క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులకు రాజీమార్గం ద్వారా పరిష్కారం లభించడం జరుగుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీడీజే సూచించారు.

అవినీతిని నిర్మూలిద్దాం : ఏసీబీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ ఎం.కిషోర్ కుమార్ పేర్కొన్నారు. అవినీతిపై సమాచారాన్ని రాజమహేంద్రవరం రేంజ్ అడిషనల్ ఎస్పీ 9440446102, డీఎస్పీ 94404 46160, తూర్పు గోదావరి ఇన్‌స్పెక్టర్ 9440446161, కాకినాడ జిల్లా ఇన్‌స్పెక్టర్ 8332971041, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌స్పెక్టర్ 9440446163, రాజమండ్రి ల్యాండ్‌లైన్ 0883-2467833 నంబర్లకు ఫోన్ చేయడం ద్వారా తెలియజేయడం బాధ్యతగా భావించాలన్నారు. అవసరమైతే వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

వివాహిత అదృశ్యం

రాజానగరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సంపత్‌నగరం గ్రామానికి చెందిన చెల్లూరి మణికంఠ అనే వ్యక్తి తన భార్య అదృశ్యమైనట్టు రాజానగరం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే ... మణికంఠ పాలడెయిరీలో పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో ఎప్పటిలాగే పాల డెయిరీకి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య దుర్గ సూర్య, ఏడాది వయసు ఉన్న కుమార్తె నందిని ఇంట్లో కనిపించలేదు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన కోనే శ్రీనుపై అనుమానం ఉందంటూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు. సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ నారాయణమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అమలాపురం నుంచి విశాఖపట్నం వరకు..!

- గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై చోరీల బాట పట్టిన యువకులు అరెస్టు
- మరో ముగ్గురు బాల నేరస్తులు కూడా అదుపులోకి
- రూ.8.82లక్షల విలువైన 13 మోటారు సైకిళ్లు స్వాధీనం


అమలాపురంలో దొంగల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలైన ముగ్గురు యువకులు మరో ముగ్గురు బాలలతో కలిసి వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. అమలాపురం నుంచి ప్రారంభించి విశాఖపట్నం జిల్లా కంచరపాలెం పోలీసుస్టేషన్ పరిధి వరకు వీరు చోరీలకు పాల్పడ్డారు. అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్‌లో నమోదైన మోటారు సైకిల్ చోరీ కేసును చేధించేందుకు తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్, తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని నేరస్తులను పట్టుకునేందుకు నియమించారు. కోనసీమ జిల్లాలో వరుస దొంగతనాలు చేస్తూ తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు యువకులను తాలూకా సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ స్థానిక తాలూకా పోలీసుస్టేషన్‌లో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. 13 మోటారు సైకిళ్లను చోరీ చేసిన మేకల హరివీరవెంకటశ్రీరామమూర్తి, వీరమల్లు తరుణ్ శశికుమార్, దొంగ లోకేశ్‌లతో పాటు మరో ముగ్గురు బాల నేరస్తులను అదుపులోకి తీసుకున్నారు. 13 మోటారు సైకిళ్లతో పాటు 3 ఎక్సైడ్ బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. అమలాపురం తాలూకా పోలీసుస్టేషన్‌తో పాటు అల్లవరం, ముమ్మిడివరం, అమలాపురం టౌన్, కొత్తపేట, విశాఖ జిల్లా కంచరపాలెం, ఉప్పలగుప్తం, అంబాజీపేట పోలీసుస్టేషన్ల పరిధిలో వీరు వరుస దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. రూ.8.82లక్షల విలువైన మోటారు సైకిళ్లతో పాటు ఎక్సైడ్ బ్యాటరీలను రికవరీ చేసినట్టు వెల్లడించారు. కేసును చేధించిన సీఐ, ఎస్ఐలతో పాటు ఏఎస్ఐ వి.సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ యు.రవికుమార్‌రాజు, కానిస్టేబుళ్లు బి.శివరామకృష్ణ, ఎం.ధర్మరాజులను డీఎస్పీ ప్రసాద్, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. కేసును చేధించిన వీరికి రివార్డులు అందజేయనున్నట్టు డీఎస్పీ తెలిపారు. చోరీ చేసిన మోటారు సైకిళ్లను అమ్మడంతో పాటు తాకట్టు పెట్టడం, ఒక్కోసారి చెత్తను కొనుగోలు చేసేవారికి స్క్రాప్ కింద అమ్మివేయడం జరుగుతుందన్నారు. సీసీ కెమెరాల ఆధారంగానే ఈ కేసును చేధించామన్నారు. యువకులపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే దొంగతనాలకు పాల్పడడంతో పాటు ఒక్కోసారి లా అండ్ ఆర్డరు సమస్యలు సృష్టించే అవకాశం ఉందన్నారు. భద్రత కోసం తప్పనిసరిగా ముఖ్యకూడళ్లలో, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకతను డీఎస్పీ వివరించారు. బాల నేరస్తులను వ్యక్తిగత పూచీకత్తులపై ఇంటికి పంపిస్తున్నట్టు వెల్లడించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

ఏలూరు రేంజ్ పరిధిలో
గంజాయి రవాణా తగ్గుముఖం

- పాత నేరస్థుల మీద నిఘా
- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్


విలేకర్లతో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గత 7 నెలలుగా ఏలూరు రేంజ్ పరిధిలో గంజాయి సాగు, అక్రమ రవాణా బాగా తగ్గుముఖం పట్టిందని, ముఖ్యంగా డాబీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అదుపులో ఉందని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం సాధారణ తనిఖీలలో భాగంగా రామచంద్రపురం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ గంజాయి మత్తు పదార్థాల రవాణాపై ప్రభుత్వం ఈగల్ వ్యవస్థను పెట్టిందని, గంజాయికి సంబంధించి ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరుకు ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు. పాతనేరస్థుల మీద నిఘాపెట్టడం జరిగిందన్నారు. 15 వేల నుంచి 20 వేలమంది నేరస్థుల సమాచారం ఫోటోలు, వేలిముద్రలు, ఇతర వివరాలు డిజిటలైజ్ చేశామని.. భవిష్యత్తులో నేరాలు జరిగినప్పుడు వారిపై నిఘా పెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. చిన్నపిల్లలు, మహిళల మీద నేరాలు చేసిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని ఇటువంటి నేరాలు జరుగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ పెరిగిన మాట వాస్తవమన్నారు. చాలామంది అమాయకులు, గ్రామీణ ప్రాంతాలవారు, చదువుకున్నవారు కూడా మోసపోతున్నారన్నారు. సైబర్ నేరాల ద్వారా సొమ్ములు పోగొట్టుకున్నవారు 1930కు 3 గంటల్లోపుగా తొందరగా ఫోన్ చేస్తే డబ్బులు బదిలీ కాకుండా బ్యాంకువారితో మాట్లాడి నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. రిజర్వుబ్యాంకు అనుమతించిన సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలని, ఎక్కువ మొత్తాలకు ఆశ పడి ప్రయివేటు సంస్థలను ఆశ్రయిస్తే మోసం జరుగుతుందని ఆయన తెలిపారు.

అంతర్వేది, శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

అంతర్వేది నరసింహస్వామి కల్యాణోత్సవాలకు 1500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని, 140 సీసీ కెమెరాలు, డ్రోన్లతో బందోబస్తు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రధాన కంట్రోల్‌రూమ్‌కు అనుబంధంగా రెండు సబ్‌కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, ఒకటి సముద్రం ప్రాంతంలో మరొకటి ఆలయం వద్ద ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఆలయ అధికారులు, జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి సామర్లకోట, ద్రాక్షారామ తదితర ప్రాంతాల్లో భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ బి. రఘువీర్, సీఐ ఎం.వెంకట నారాయణ, ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు ఉన్నారు.

8 నుంచి భీమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ఆలయ సహాయ కమిషనర్


సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ సహాయ కమిషనర్ భవానీ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈనెల 8 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో, సహాయ కమిషనరు అల్లు వెంకటదుర్గాభవానీ తెలిపారు. బుధవారం ద్రాక్షారామ స్వామివారి దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. 8న 3.30 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, సాయంత్రం 6 గంటలకు నంది వాహనంపై స్వామివారి నగరోత్సవం జరుగుతుందన్నారు. రాత్రి 11.05 గంటలకు మణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, చండీకా సమేత సూరేశ్వర స్వామి, లక్ష్మీ సమేత నారాయణ స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. 9 నగరుడ వాహనంపై నగరోత్సవం, 10న సాయంత్రం పండిత సదస్యం, రాత్రి 8 గంటలకు సర్వవాహనములపై నగరోత్సవం జరుగుతుందన్నారు. 11న మధ్యాహ్నం 2.55 గంటలకు రథోత్సవం జరుపుతామన్నారు. 12న వసంతోత్సవం, నాకబలి గ్రామోత్సవం, త్రిశూల శ్రీచక్రస్నానములు, రాత్రి 8 గంటలకు సర్ప వాహనంపై గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 13న సప్తగోదావరి నదిలో స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు. 14న శ్రీపుష్పోత్సవం జరుపుతామన్నారు. 8న ఉదయం స్వామివారికి దాతలు సత్తి సుబ్బారెడ్డి దంపతులతో లక్ష రుద్రాక్షల పూజ జరుపుతామన్నారు. భక్తులు కల్యాణోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కల్యాణ మహోత్సవాలు నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈవో తెలిపారు.

పాదగయలో..

మహాశివరాత్రి

ఉత్సవాలపై నేడు సమీక్ష

పిఠాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లుపై గురువారం మధ్యాహ్నం 3గంటలకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో కాకినాడ ఆర్డీవో మల్లిబాబు సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా చేయాల్సిన ఏర్పాట్లు, ఇతర అంశాలపై ఆర్డీవో సమీక్షిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు.

డెల్టా కాలువలకు నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రబీ అవసరాల కోసం డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచి 8550 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 2450 క్యూసెక్కులు, మధ్య డెల్టా ప్రధాన పంట కాలువకు 1700 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా ప్రధాన పంట కాలువకు 4400 క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత 8562 క్యూసెక్కులు ఉండగా ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.65 అడుగులుగా నమోదయింది.

భీష్మ ఏకాదశికి..
సత్యదేవుని సన్నిధిలో ఏర్పాట్లు

పరిశీలించిన ఈవో


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వ తేదీన భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని సత్యదేవుని సన్నిధికి వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా అన్నవరం దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 15వేల వ్రతాలు వరకు జరుగుతాయని, 80వేల నుంచి లక్షమంది వరకు స్వామి సన్నిధికి విచ్చేస్తారనే అంచనాకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున తిరుమలలో తొక్కిసలాట సంఘటన నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడికక్కడ క్యూలైన్ల పటిష్టపరచడం, వ్రతాలు, దర్శన సమయాల్లో భక్తులు తోసుకోకుండా పశ్చిమరాజగోపురం వద్ద హోల్డింగ్‌పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. క్యూలైన్‌లలో తాగునీరు సదుపాయం, పలుచోట్ల చిన్నారులకు పాలు పంపిణీ, వృద్ధులు, దివ్యాంగుల కోసం లిఫ్ట్‌వద్ద ప్రత్యేక ఏర్పాట్లు, ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటుచేశారు. దీనికి సంబంధించి ఏర్పాట్లను బుధవారం ఈవో వీర్ల సుబ్బారావు, దేవస్థానం సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. రాత్రి 10గంటల నుంచి వ్రతం టిక్కెట్ల విక్రయాలు ప్రారంభించి 12 గంటల నుంచి వ్రతాలు, ఒంటిగంట నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని ఆదేశించారు. బుధవారం వ్రతపురోహిత సూపర్‌వైజర్లతో ఈవో సమావేశమయ్యారు. వ్రతమాచరించుకునే భక్తుల పట్ల పురోహితులు మర్యాదపూర్వకంగా మెలగాలని, వారికి వచ్చిన సందేహాలను విసుగుచెందకుండా వివరంగా తెలపాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్.రామ్మోహనరావు, ఏఈవోలు శ్రీనివాస్, జగ్గారావు, సూపరెంటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, ఐవీ రామారావు, ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

నీతి అయోగ్ సభ్యురాలు పూజలు

సత్యదేవుడి సన్నిధిలో బుధవారం నీతిఅయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సరస్వాట్ కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందచేయగా ఈవో వారికి స్వామివారి ప్రసాదం, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.


ఆయోగ్ సభ్యురాలు సరస్వాట్‌కు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈవో సుబ్బారావు

తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు ప్రారంభం



తాటిపర్తిలో పోటీలను ప్రారంభిస్తున్న జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాట్లాడుతున్న పడాల రవి

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో 18వ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో గ్రామంలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై ఈనెల 9వ తేదీ వరకూ నిర్వహించే ఈ పోటీలను జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నాటకాలను ప్రోత్సహించేందుకు నాటక కళాపరిషత్‌ల ద్వారా ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నాటకాలకు నేటికి ఆదరణ తగ్గలేదని, ఇందుకు నిదర్శనం నాటికలను తిలకించేందుకు వస్తున్న ప్రజానీకమేనని తెలిపారు. మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు, న్యాయవాది పడాల రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, అపర్ణాదేవి ఆలయ కమిటీ ఛైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, జనసేన నాయకులు బవిరిశెట్టి రాంబాబు, పిల్లా శివశంకర్, వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి ఉన్నారు.

మూడో రోజుకు ఆలిండియా లాన్ టెన్నిస్ పోటీలు

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఐటా, గోదావరి ఏపీఎల్‌టీఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలిండియా అండర్-16 లాన్ టెన్నిస్ పోటీలు బుధవారం మూడోరోజుకు చేరాయి. క్వార్టర్ సెమీఫైనల్‌లో వివిధ రాష్ట్రాల క్రీడాకారులు తలపడ్డారు. బాలుర విభాగంలో ధ్రువ్ (తమిళనాడు)పై ఎస్‌వీసూర్య(ఏపీ) 6-06-1, తనీష్(తెలంగాణ)పై దుర్గాశ్రీ (ఏపీ) 3-6,6-3,6-4, విస్సెంట్(ఏపీ)పై విశ్రాంక్(తెలంగాణ) 6-26-4, భువన్(ఏపీ)పై భవేష్(తెలంగాణ)7-6,6-1 స్కోరుతో గెలుపొందారు.

బాలికల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో జోషిత(ఏపీ)పై సుమేరా(ఏపీ)7-6(4)6-1, గౌరిశ్రీ (తెలంగాణ)పై జానకి(ఏపీ), 6-3,6-1, నవర్షిక(తెలంగాణ)పై లేఖ్య(ఏపీ)7-5,7-5, జోహా(తెంగాణ)పై సంజన(ఏపీ)6-2,6-3 స్కోరుతో గెలుపొందారు. లాన్‌టెన్నిస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి పీవీ రామ్‌కుమార్ పర్యవేక్షించారు.

బాలికను మోసం చేసిన బాలుడిపై పోక్సో కేసు

రాజానగరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని నమ్మ బలుకుతూ... తీరా పెళ్లి చేసుకుందామని ఆ బాలిక అడగడంతో ముఖం చాటేశాడు ఓ బాలుడు... వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరి జిల్లా రాజానగరం - నరేంద్రపురం జంక్షన్ ప్రాంతంలో నివసిస్తున్న ఒక బాలికను అదే ప్రాంతంలో ఉంటున్న బాలుడు హైస్కూల్ స్థాయి నుంచి నిన్ను ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతుండేవాడు. కొంతకాలం తిరస్కరిస్తూ వచ్చిన సదరు బాలికను ఎట్టకేలకు లొంగదీసుకున్నాడు. ఈ మేరకు బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఎస్ఐ నారాయణమ్మ దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపారు.

మానవ జీవనంలో కళ అత్యుత్తమం

సినీ గేయ రచయిత జొన్నవిత్తుల
'శ్రీప్రకాష్'లో హరివిల్లు కార్యక్రమం


జొన్నవిత్తులను సత్కరిస్తున్న విజయ్‌ప్రకాష్

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మానవ జీవనంలో కళ అత్యుత్తమమైనది, అది అత్యుత్తమమైన మనస్సుకు ప్రశాంతతనిస్తుందని కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అన్నారు. కాకినాడ సురేష్ నగర్ శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లోని సీతానరసింహ క్షేత్రం నందు శ్రీప్రకాష్ విద్యాసంస్థలు కాకినాడ, పెద్దాపురం శాఖలు సంయుక్తంగా బుధవారం హరివిల్లు కార్యక్రమం నిర్వహించాయి. ఐదురోజుల పాటు జరిగే హరివిల్లు ఆర్ట్ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌లో విద్యార్థులు చిత్తు కాగితాలతో రూపొందించిన చిత్తరువులు అందర్నీ ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథులుగా హాజరైన జొన్న విత్తుల, చిత్రకారిణి గౌరీవేముల, గ్రంధి రాజగోపాల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జొన్న విత్తుల మాట్లాడుతూ హరివిల్లు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నిద్రాణమై ఉన్న శక్తిని వెలికితీసి సమాజానికి ఒక అద్భుతమైన సందేశాన్ని ఇచ్చే విధంగా చిత్రాలు, కళాకృతులు ఉన్నాయన్నారు. గౌరీ మాట్లాడుతూ కళ అనేది ఒక తపస్సు అని కళాకారుడు ఒక రుషీశ్వరుడని అన్నారు. అతిథులను శ్రీప్రకాష్ డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ సత్కరించారు. కార్యక్రమంలో ఆల్ ఈజ్ వెల్ కాకినాడ ఫౌండర్ కిషోర్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు, శ్రీప్రకాష్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల బస్సు ఢీకొని
మూడేళ్ల చిన్నారి మృతి


మృతి చెందిన సుకన్య (ఫైల్)

తొండంగి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అప్పటివరకూ చెంగుచెంగున గెంతుతూ ఆటలాడుకున్న చిన్నారి కొద్ది నిమిషాల వ్యవధిలో విగత జీవిగా మారింది. బుధవారం కాకినాడ జిల్లా తొండంగి మండలం సీతారాంపురంలో శివకోటి సుకన్య (3) అనే చిన్నారిని తునికి చెందిన ఎస్‌వి జూనియర్ కళాశాల బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఉదయమే విద్యార్థులతో కళాశాలకు వెళ్తున్న బస్సు డ్రైవర్ నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా చిన్నారి మృతి చెందిందని గ్రామస్తులు, బంధువులు ఆరోపించారు. సింహాద్రి అప్పన్న, నాగలక్ష్మికి ఉన్న నలుగురు పిల్లల్లో సుకన్య మూడో సంతానం. అల్లారు ముద్దుగా పెరిగిన చిన్నారి కళ్లెదుటే శవమై కనిపించడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు.

దళిత సంఘాల ఆందోళన

చిన్నారి మృతికి కారణమైన డ్రైవర్‌పై చర్య తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని దళిత నేతలు ఆందోళన చేపట్టారు. యాజమాన్యం వచ్చి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తుని రూర్ ఎస్ఐ కృష్ణమాచారి ఆందోళనకారులతో చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సంఘటనపై కేసు నమోదు చేశారు.


ఆందోళన చేస్తున్నవారితో చర్చలు జరుపుతున్న ఎస్ఐ

వ్యక్తిని పొడిచిన కేసులో నిందితుడికి ఏడాది జైలు

కడియం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియపులంక గ్రామంలో 2020లో దొంగ ఓ ఇంటిలో దొంగతనం చేసి పారిపోతుండగా అదేసమయంలో అతడిని అడ్డుకున్న వ్యక్తిని పొడవడంతో దొంగకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ 3వ ఏజేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి చావలి రమ్య తీర్పు నిచ్చారు. సీఐ ఏ.వేంకటేశ్వరరావు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. 2020లో కడియపులంకలో ఓ వ్యక్తి ఓ ఇంటిలో దొంగతనానికి పాల్పడ్డాడు. అనంతరం పారిపోతున్న సమయంలో ఓ వ్యక్తి అడ్డుకోవడంతో దొంగ పొడిచాడు. ఈ విషయంపై అప్పటి ఎస్ఐ ఎస్ కే.అమీనాబేగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అప్పటి క్రైం కానిస్టేబుల్ కే.సురేష్ నిందితుడిని అరెస్టు చేశారు. 3వ ఏజెఎఫ్‌సీఎం ప్రిన్సిపల్ జువైనల్ జస్టిస్ బోర్డ్ కోర్ట్ నందు ప్రస్తుత సీఐ ఏ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎం రాజేంద్రసకాలంలో సాక్షులను ప్రవేశపెట్టారు. పీపీ సీహెచ్ రాజశేఖర్ వాదనలు వినిపించారు. దీంతో దొంగతనానికి పాల్పడి పారిపోతున్న సమయంలో అడ్డుకున్న వ్యక్తిని పొడిచిన నిందితుడు నేతల రాజేష్‌వర్మ అలియాస్ రాజేష్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు రెండున్నరేళ్ల జైలు

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిలిస్టు మృతికి కారణమయిన లారీ డ్రైవర్‌కు రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ పిఠాపురం ఆసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.బాబు బుధవారం తీర్పు చెప్పారు. పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం.. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సిగటాపు శ్రీనివాసరావు విధి నిర్వహణ అనంతరం కాకినాడకు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా చిత్రాడ మహాలక్ష్మీ ఆలయం వద్ద ఎదురుగా రాంగ్‌రూట్‌లో వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. 2021లో జరిగిన ఈ సంఘటనపై అప్పటి పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం లారీ డ్రైవర్ పోతల అప్పలనాయుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదాలు అనంతరం నేరం రుజువు కావడంతో అప్పలనాయుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీలు ఎం.ప్రకాశరావు, జి.వినయప్రతాప్‌లు వాదనలు వినిపించారు.

చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

కంప్యూటర్, లాప్‌టాప్‌లు, ప్రింటర్ స్వాధీనం



నిందితుడితో పోలీసులు స్వాధీనం చేసుకున్న లాప్‌టాప్‌లు, ప్రింటరు, కంప్యూటర్

కడియం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పలు చోట్ల దొంగతనాలకు పాల్పడిన ముగ్గురిలో ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతడి నుంచి కంప్యూటర్, లాప్‌టాప్, ప్రింటర్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు కడియం పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం....గత నెల 9వ తేదీన స్థానిక జాతీయ రహదారి పక్కన వెంకయ్యపేట పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ నందు షటర్ తాళాలు బద్దలు గొట్టి లాప్‌టాప్, కంప్యూటర్, కొంత నగదు దొంగిలించినట్టు వచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. తూరుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు, డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో కడియం సీఐ ఏ.వేంకటేశ్వరరావు, ఎస్ఐ బి.నాగదుర్గాప్రసాద్ ఈ కేసు చేదించారు. ఈ చోరీలకు ముగ్గురు పాల్పడినట్టు పోలీసులు నిర్ధారించారు. ముగ్గురిలో ఒకరైన దొంగతనానికి పాల్పడిన కృష్ణా జిల్లా చౌటుపల్లి గ్రామానికి చెందిన అల్లాడి నాగ మణికంఠ ఈశ్వర్‌ను అరెస్టు చేసి అతడి నుంచి లాప్‌టాప్, కంప్యూటర్, తణుకు పరిధిలో దొంగతనం చేసిన ఓ మోటారు సైకిల్, కొత్తగూడెం పరిధిలో దొంగతనం చేసిన లాప్‌టాప్, ప్రింటర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్టు... మరోవ్యక్తిని టంగుటూరు పోలీసుస్టేషన్ పరిధిలో అరెస్టు చేశారని,మరోవ్యక్తి పరారీలో ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు.



కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం శ్యామలాసెంటర్‌లో నిరసన కార్యక్రమం దృశ్యం

లేబర్ కోడ్స్ ఉపసంహరించుకోవాలి

● కేంద్ర కార్మిక సంఘాల నిరసన

రాజమహేంద్రవరంఅర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని, ఈ కోడ్స్‌ను వెంటనే ఉపసంహరించుకోకపోతే భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు, కర్షకులు, శ్రామికులు, తదితర పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రయోజనం లేని ప్రజావ్యతిరేక బడ్జెట్ తీసుకొచ్చిందని విమర్శించారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ బుధవారం కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని శ్యామలాసెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకులు టి.అరుణ్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు టి.మధు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు డి.శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర కార్మికసంఘాలు తీవ్రంగా వ్యతిరేకించినా కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లేబర్‌కోడ్స్‌ను అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం దుర్మార్గమని అన్నారు. కార్మికులను కార్పొరేట్లకు కట్టుబానిసలుగా మార్చేందుకే ఈ లేబర్ కోడ్స్ తీసుకొచ్చారని విమర్శించారు. లేబర్‌కోడ్స్‌వల్ల కార్మికుల ప్రాణాలకు భద్రత లేకపోవడంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, కనీస వేతనాలు అమలు వంటి ప్రాథమిక చట్టాలు అధోగతిపాలయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా కార్మిక సంఘాల నాయకులు ఎం.సుందర్‌బాబు, బి.పవన్, ఎస్ఎస్ మూర్తి, టీఎస్ ప్రకాష్, సావిత్రి, మురళి, పూర్ణిమరాజు, కె.రాంబాబు, వి.కొండలరావు, లావణ్య, సప్పా రమణ, పి.త్రిమూర్తులు, ఎన్.దుర్గారావు, అప్పలరాజు, సుబ్రహ్మణ్యం, లక్ష్మణరావు, కార్మికులు, జట్ల సంఘం కమిటీ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

కూటమి శ్రేణులకు ఇన్‌చార్జి మంత్రి నిమ్మల పిలుపు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గం ఎమ్మెల్సీ స్థానం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని, అది 8నెలల కూటమి ప్రభుత్వంపై ప్రజల నమ్మకానికి రిఫరెండం అవుతుందని రాష్ట్ర జలవనరులశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు క్యాడర్‌కు పిలుపునిచ్చారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి కానూరులోనూ, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుతో కలి దేవరపల్లిలోనూ, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావుతో కలసి కొవ్వూరులోనూ, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణతో రాజానగరం నియోజకవర్గంలోనూ, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో కలసి రాజమండ్రి సిటీలోనూ, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరితో ప్రియాంక గార్డెన్స్‌లో సభలు నిర్వహించారు. కేవలం 20రోజుల మాత్రమే సమయం ఉందని, ప్రతీ బాధ్యత తీసుకుని, ఆయా గ్రామాలలో ఓటర్లను కనీసం 5సార్లు కలసి, రాజశేఖర్‌కు ఓటు వేయవలసిన అవసరం గురించి చెప్పాలన్నారు. ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, ఓవర్ కాన్ఫిడెన్స్ మంచిది కాదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, చిత్రంలో ఎమ్మెల్యే గోరంట్ల, మాజీ మంత్రి కెఎస్ జవహర్

● విషపాము బుసగొడితే తలపై కొట్టాలి: ఎమ్మెల్యే గోరంట్ల

సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కేవలం 8నెలలోనే ప్రజల మన్ననలు పొందుతూ, అభివృద్ధి, సంక్షేమ పథకాలు దిశగా వెళుతుంటే కొన్ని విషపు పాములు బుసకొట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని, అలా బుసకొడితే సరిగ్గా తలమీద కొట్టాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. స్థానిక ప్రియాంక గార్డెన్స్‌లో బుధవారం రాత్రి జరిగిన రూరల్ నియోజకవర్గ టీడీపీ నేతల సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుతో కలసి మాట్లాడారు. వైసీపీ గ్లోబల్ ప్రచారం చేసే ప్రయత్నాలు చేస్తుందని, ఈ ఎన్నికలలో గెలిచి, వాళ్లకు గుణపాఠం చెప్పాలన్నారు. ఈసమావేశంలో పార్టీనేతలు ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, పరిశీలకురాలు ఎం.తేజావతి, డి.నాదుబాబు, మత్స్యేటి ప్రసాద్, సప్పా చిన్నారావు, ముద్రగడ జమ్మి, గట్టి సుబ్బారావు, మజ్జి పద్మ,ఆకుల శ్రీధర్. గోరంట్ల రవికిరణ్ , మార్ని వాసు, మార్గాని సత్యనారాయణ పాల్గొన్నారు.

పేరాబత్తులను గెలిపించుకుందాం

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గం కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుందాం అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , రామచంద్రపురం నియోజకవర్గం ఇన్‌చార్జి గన్నికృష్ణ పిలుపునిచ్చారు. ఈమేరకు ఒక ప్రకటన బుధవారం విడుదల చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో జరిగిన సమావేశాల్లో పాల్గొని నాయకులకు, కార్యకర్తలకు సూచనలు చేశారు. ప్రతి 50 ఓట్లుకు ఒక బాధ్యుడు ఉండాలని వేగంగా ఓటర్లను టచ్ చేయాలని సూచించారు. పేరాబత్తుల విజయానికి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న గన్నికృష్ణ

పుష్కరవనం వాకర్స్ క్లబ్ విరాళం

రాజమహేంద్రవరంకల్చరల్ ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): పుష్కరవనం వాకర్స్ క్లబ్ వారిచే రామకృష్ణమిషన్ ధర్మ వైద్యశాల అదనపు భవన నిర్మాణానికి, క్లబ్ సభ్యులు, 10 కి.మీల మారథాన్ నిర్వహించగా వచ్చిన రూ.3లక్షల 66వేలు ఫండ్‌ను రామకృష్ణమిషన్ ధర్మ వైద్యశాల ఓపీ విభాగపు అదనపు భవననిర్మాణానికి డాక్టర్ యన్నమని రామచంద్రరావు, అల్లూరి వెంకటేష్, స్వామీజీకి విరాళంగా చెక్కును అందజేశారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

● ఇంటిప్లాన్ల మంజూరులో నిబంధనలు పాటించాలి : కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి, కమీషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరంరూరల్ ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు 100శాతం వసూలు చేయాలని రూరల్ మండల గ్రామాల ప్రత్యేకాధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ కార్గ్ అధికారులను హెచ్చరించారు. హుకుంపేటలో గల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి శాంతామణితో కలిసి నగరపాలక సంస్థ విలీన ప్రతిపాదిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, రూరల్, రాజానగరం, కడియం మండలాల ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, మండల ఇంజనీరింగ్, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం బుదవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా పన్నుల వసూళ్ళ ప్రగతి, గ్రామాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, తదితర అంశాలపై ఆయా కార్యదర్శుల నుంచి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ 15 రోజుల్లో 50శాతం పన్నులు వసూలు చేయాలని లేని పక్షంలో తగుచర్యలు తీసుకొనేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రతి గ్రామంలోనూ చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఉదయం 6గంటలకల్లా పారిశుధ్య సిబ్బంది విధుల్లోకి వచ్చి పనులు మొదలు పెట్టాలని, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. బిల్డింగ్ ప్లాన్ల మంజూరు విషయంలో ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని, ప్లాన్ అప్రూవల్స్ ఇచ్చిన తరువాత సంబంధిత భవనానికి సంబంధించి ఎలాంటి డీవియేషన్లు లేకుండా ఉండేలా చూసుకోవలసిన బాధ్యత ఆయా పంచాయతీ కార్యదర్శులదే అన్నారు. వీటిని అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు వుంటాయన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు, ఎన్‌క్రోచ్‌మెంట్ల విషయంలో సంబంధిత వ్యక్తులకు నోటీసులతో పనిలేకుండా కూల్చివేయాలని తెలిపారు. అనువైనచోట్ల సామాజిక స్థలాలలో షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మాణాలు చేపట్టడంద్వారా ప్రభుత్వానికి ఆదాయంతో పాటు పలువురికి ఉపాధి కలుగుతుందని వీటిపై తగు ప్రణాళికలు తయారుచేయాలని అధికారులకు సూచించారు. మార్చి చివరినాటికి లేఅవుట్లలో వున్న ఇళ్ళ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో డియల్‌పీవో కార్యాలయం ఏవో వెకంటేశ్వరరావు రూరల్, రాజానగరం కడియం, రాజానగరం యంపీడీవోలు శ్రీనివాసరావు, ఝాన్సీ, రమేష్ కుమార్, హౌసింగ్ డిఈ సత్యన్నారాయణ, పంచాయతీరాజ్ జెఈ సంపత్ , ఈవోపీఆర్డీలు సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, వాణీ, రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు

ద్వారకాతిరుమల నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో నిర్వహిస్తున్న రెండు ట్రస్టులకు ఓ భక్తుని కుటుంబం బుధవారం రూ.3 లక్షలు విరాళంగా అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన వి.ఎస్.సుమంత్ కుమార్ ముందుగా నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2లక్షలు, విమాన గోపుర స్వర్ణమయ పథకానికి రూ.లక్ష వెరసి రూ.3 లక్షలను అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ ఏఈవో పి.నటరాజారావు విరాళం బాండు పత్రాన్ని అందజేశారు. అనంతరం శ్రీవారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.



దాత సుమంత్ కుమార్ కుటుంబానికి బాండు పత్రాన్ని అందజేస్తున్న ఏఈవో నటరాజారావు

పీఎంపీలకు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరంకల్చరల్ ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు చేరువలో సేవలందించే పీఎంపీలకు నూతన వైద్య విధానాలపై అవగాహనా సదస్సు బుధవారం స్థానిక గోదావరి రుచుల కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో స్థానిక శ్రీకర్ హాస్పిటల్ రోబోటిక్ జాయింట్ రిప్లేస్‌మెంట్ వైద్యనిపుణుడు రోహిత్ హాజరయ్యారు. అత్యాధునిక రోబో సర్జరీ ట్రీట్‌మెంట్ గురించి వివరించారు. రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ పీఎంపీలకు ఇలాంటి వైద్య విజ్ఞాన అవ గాహనా సదస్సులు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు, కార్యదర్శి పి.దేవానందం, కోశాధికారి పి.చిన్నిమట్లా రమేష్, యు. ప్రసాద్‌బాబు, ఎ.సురేష్, బేబీ సరోజిని, విశైలజ తదితరులు హాజరయ్యారు. డాక్టర్ రోహిత్‌కుమార్‌ను సభ్యులు ఘనంగా సత్కరించారు.

కనకదుర్గమ్మ విగ్రహ పునర్‌ప్రతిష్ఠ మహోత్సవం

రాజమహేంద్రవరంకల్చరల్ ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణపురం గోపాల్‌నగర్ పుంతరోడ్డులోని శ్రీ కనకదుర్గమ్మ వారి విగ్రహ పునర్‌ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 5,6,7 తేదీల్లో జరిగే ఈ కార్యక్రమాల్లో, బుధవారం అమ్మవారి విగ్రహ ఊరేగింపు వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి కొబ్బరికాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. నగర ప్రముఖులు చల్లా శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు మలిశెట్టి వాసు, వెంకన్న, నాగరాజు, బాలాజీ, పవన్, శంకర్, వెంకటరత్నం, ఆనంద్, నాయుడు, భాష, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కనకదుర్గ అమ్మవారి విగ్రహ పునర్‌ప్రతిష్ఠమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్

చందన యాత్ర మహోత్సవాలు

రాజమహేంద్రవరంకల్చరల్ ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోరుకొండ రోడ్డులోని సింహాచలనగర్ శ్రీవరాహలక్ష్మి నృసింహ స్వామిక్షేత్రం చందన యాత్ర మహోత్సవాలు, ఆలయ ధర్మకర్తలు కాలెపు సింహాచలం, నాగేశ్వరావుల పర్యవేక్షణలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకుడు శ్రీకిరణ్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ధ్వజారోహణ, యాగశాల ప్రవేశం, చతుస్థాన అర్చనలు,నిత్యం హోమాలు, నిత్య పూర్ణాహుతి జరిగాయి. తిరువీధి ఉత్సవం ఆలయంవద్ద ప్రారంభమై రాజా థియేటర్, కంబాలచెరువు, మెయిన్‌రోడ్ మీదుగా ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలు, బాజాభజంత్రీలు, కోలాటం, మహిళ కలశాలతో ఊరేగింపులో పాల్గొని సందడి చేశారు.

ఏఎన్ఎంపై ఎంపీడీవోకు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న మహాలక్ష్మీపేట మహిళలు

అనపర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి సచివాలయం- 5 పరిధిలోని వెల్‌నెస్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం రాజేశ్వరి వైఖరిపై విసుగు చెందిన మహాలక్ష్మీపేటకు చెందిన మహిళలు బుధవారం ఎంపీడీవో రామకృష్ణారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. రాజేశ్వరి రోగుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని వారు వాపోయారు. చిన్నారులకు అందించాల్సి వ్యాక్సిన్లు సైతం వేయడం లేదని, కానీ రికార్డులో వేసినట్లుగా సంతకం పెడుతున్నారని వారు ఆరోపించారు. కనీసం పోలీయో చుక్కలు కూడా వేయడం లేదని ఎంపీడీవోకు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ తానే స్వయంగా వచ్చి పరిశీలిస్తానని వారికి హామీ ఇవ్వడంతో అక్కడి నుంచి వారంతా వెనుదిరిగారు.

జగన్ పాలనలోనే రాష్ట్రానికి నష్టం

●మంత్రి నిమ్మల రామానాయుడు



బూరుగుపూడి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

కోరుకొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సమయంలో కన్నా... జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం వాటిల్లిందని, ఈ ఏడు నెలల ఎన్డీయే పాలనతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా కోరుకొండ బూరుగుపూడి టీడీపీ కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కల్పించారు. సమావేశంలో మాజీ మంత్రి కేఎస్ జవహర్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, బీజేపీ ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్న చౌదరి మాట్లాడారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు తనకాల నాగేశ్వరరావు, అడపా వీరబాబు, మల్ల అప్పలనర్సారావు,గంగిశెట్టి సత్తిబాబు, జనసేన నాయకులు అడ్డాల శివ, డాక్టర్ అడపా శ్రీనివాస్, ముక్కా రాంబాబు, కడిమి శ్రీరామ్, మేడిశెట్టి శివరాం, రాజానగరం నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు వడ్డీలేని రుణాలు : ఎమ్మెల్యే



టీడీపీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మహిళలకు వడ్డీలేని రుణాలు మంజూరు కాబోతున్నట్టు రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. 25వ డివిజన్‌లో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో 250 మంది మహిళలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వారందరికీ పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. అనంతరం వాసు మాట్లాడుతూ మహిళలో చైతన్యం మొదలైందన్నారు. గత పాలకులు మహిళల ఆర్థికాభివృద్ధికి తూట్లు పొడిచారన్నారు. 2019 ఎన్నికల్లో ఈ డివిజన్‌లో తన భార్య ఆదిరెడ్డి భవానికి 1200 ఓట్లు మెజార్టీ ఇస్తే, 2024 ఎన్నికల్లో తనకు 2700 ఓట్లు మెజార్టీ ఇచ్చారని గుర్తుచేశారు. గత ఐదేళ్లుగా తాము ప్రతి పక్షంలో ఉన్నా - 25వ డివిజన్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేశామన్నారు. ప్రజాప్రతినిధులమని చెప్పుకుని తిరిగేకొందరు తమకు అడ్డుపడ్డారని గుర్తుచేశారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను అర్హులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని చెప్పారు. డ్వాక్రా మహిళలకు కూడా గత ప్రభుత్వం చేసిందేమీలేదన్నారు. కూటమి ప్రభుత్వం స్త్రీనిధి కింద రూ.లక్ష ఇస్తుందని, మగవారికి పొదుపు సంఘం ద్వారా రుణాలు వస్తాయన్నారు. రానున్నవి మంచిరోజులేనని చెప్పారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, చాంబర్ అధ్య క్షుడు తవ్వా రాజా, చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, నగర కార్యదర్శి బుడ్డిగ రాదా, ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకి రామయ్య, పార్లమెంట్ కమిటీ మహిళా అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

గోకవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తంటికొండలో కొలువై ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి వారి 65 వ బ్రహ్మోత్సవాలు మూడో రోజైన బుధవారమూ ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం పంచామృతం, మండపారాధన క్షేత్రపాలక అభయ ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, విశేష అర్చన, హోమ క్రతువులను కనుల పండువగా జరిపించారు. దేవస్థానం ఛైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, సువర్ణ తులసి దంపతులు, ఏపీఈపీడీసీఎల్ ఏఈ సుబ్రహ్మణ్యం దంపతులు, తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ దంపతులు, భక్తులు

కనకదుర్గకి హరిద్రాభిషేకం



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

అనపర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని నల్లకాలువ వద్ద వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారికి బుధవారం మహిళలు హరిద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి మహిళలు కలశాల చేతబట్టి గోదావరి జలాలను తీసుకువచ్చి అభిషేకించారు. ఆలయ నిర్వహకుడు వెంకట్రావు భవాని మాట్లాడుతూ ఆలయ 21వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ఈ పూజ చేసినట్టు చెప్పారు. మహిళలకు ఆలయ కమిటీ తరపున తీర్థప్రసాదాలు అందజేశారు.



కప్పును స్వీకరిస్తున్న ఎస్‌కేవీటీ జట్టు

హ్యాండ్‌బాల్ టోర్నీ విజేత ఎస్‌కేవీటీ

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలో ఈనెల 4,5 తేదీల్లో జరిగిన పురుషుల అంతర్ కాలేజీ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచి కప్పు కైవసం చేసుకున్నట్టు ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి తెలిపారు. దీంతో ఫిబ్రవరి 2026లో తమిళనాడు రాష్ట్రం సేలంలో గల పెరియార్ విశ్వవిద్యాలయం సౌత్‌జోన్ నందు జరిగే పోటీల్లో నన్నయ్య విశ్వవిద్యాలయం తరపున జానకీరామ్, జె .భువనేష్, బి.దుర్గాప్రసాద్, ఆర్.సుధీర్‌కుమార్ పాల్గొనేందుకు ఎంపికైనట్టు ఆయన తెలిపారు. పి.కిషోర్‌బాబు, పీవీబీ సంజీవరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంబీఏ విద్యార్థులకు బడ్జెట్‌పై వర్క్‌షాప్



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యఅతిథులు

రాజానగరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ) మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ -25 వర్ధమాన నిర్వాహకుల అంతర్ దృష్టి అనే అంశంపై సర్ విశ్వేశ్వరయ్య బ్లాక్ సెమినార్ హాల్లో బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. గైట్ స్వయం ప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపాల్ టి.జయానంద కుమార్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌పై ఎంబీఏ విద్యార్థులకు లోతైన అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశమన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల బలోపేతానికి బడ్జెట్ పెద్దఎత్తున ప్రోత్సాహం కల్పించిందని విద్యార్థులకు వివరించారు. ఎంబీఏ విభాగాధిపతి బీవీఆర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌వీవీ ఎస్ఎన్ మూర్తి, ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, ఎన్.లీలావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గోదావరి ఉత్సవంలో ఆదిత్య నాగేశ్వరరావుకు సత్కారం



సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్ ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ధర్మంచర హాల్‌లో బుధవారం జరిగిన గోదావరి ఉత్సవం - 2025 కార్యక్రమంలో విభిన్నరంగాలలో ప్రముఖులైన తెలుగు తేజాలకు ఘన సత్కారం జరిగింది. ప్రముఖ ఫిలాంత్రఫిస్ట్ అద్దంకి రాజా ఆధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మాస్ట్రో గజల్ శ్రీనివాస్, విశిష్ఠ అతిథిగా శాసనమండలి సభ్యులు బొర్రా గోపిమూర్తి పాల్గొన్నారు. సేవారంగానికి సంబంధించి ఆదిత్య కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్వీ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణికుమార్, ఎస్కే రహమాన్, రామకృష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా..



పుష్పక వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహుని దివ్యకల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల రెండో రోజైన బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గరుడ పుష్పక వాహనంపై స్వామి వారు ఊరేగారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి విచ్చేశారు. రాత్రి 7 గంటలకు పుష్పక వాహనంపై గ్రామోత్సవం జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. - రాజోలు

సంప్రదాయ నృత్య ప్రదర్శన.. (పైన) గిరిజన నృత్యం చేస్తున్న గోరంట్ల, వీసీ తదితరులు



ఆదివాసీల మహోత్సవం

నన్నయ వర్సిటీలో బుధవారం ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. దీనికి 400 మంది గిరిజన కళాకారులు, 1500 మంది ప్రతినిధులు హాజరయ్యారు.



టమోటా ఢమాల్!

» గణనీయంగా తగ్గుతున్న ధరలు.. స్థానిక ఉత్పత్తులతో డౌన్

» మదనపల్లి, అనంతపురం నుంచి దిగుమతులకు బ్రేక్

» బహిరంగ మార్కెట్లలో కిలో రూ.20, రైతుబజార్లలో రూ.14

టమోటాకు ... 'లోకల్' నాటు దెబ్బ బలంగా తగులుతోంది. కొద్దిరోజుల నుంచి ధరలు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈ ధరలు మరింత తగ్గొచ్చని కూడా రైతులు, వ్యాపారులు అంచనా వేస్తున్నారు. గత వారం పది రోజులుగా లోకల్ సరుకు ఊపందుకోవడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

(ఆంధ్రజ్యోతి- రాజమహేంద్రవరం అర్బన్)

లోకల్ సరుకు భారీగా రావడంతో ఇతర జిల్లాల నుంచి టమోటా దిగుమతులు తగ్గిపోయాయి. ఇక్కడే రేటు తక్కువగా ఉంటే బయట నుంచి సరుకు తీసుకొచ్చి ఏం చేయాలనే భావనతో హోల్‌సేల్ వ్యాపారులు చాలామంది దిగుమతులు నిలిపివేసినట్టు చెబుతున్నారు. టమోటాలకు చిత్తూరు జిల్లా మదనపల్లి, పరిసర ప్రాంతాలు, అనంతపురం జిల్లాలోని కొన్ని ఏరియాలు పెట్టింది పేరన్న సంగతి తెలిసిందే. ఇంచుమించు ఏడాది పొడవునా అక్కడి నుంచే టమోటా మార్కెట్లకు వస్తుంటుంది. మధ్య మధ్యలో బెంగళూరు టమోటాలు వచ్చినా ధరల్లో పెద్ద తేడా కనిపించదు. అక్కడి నుంచి దిగుమతయ్యే టమోటాలకు లోకల్ మార్కెట్లలో కిలో రూ.30-రూ.40 పైనే ధర ఉంటుంది. అయితే ఇప్పుడు సీన్ పూర్తిగా రివర్స్ అయ్యింది. లోకల్ టమోటా మార్కెట్లను ముంచెత్తడంతో మదనపల్లి, అనంతపురం ప్రాంతాల టమోటాలకు డిమాండ్ పడిపోయింది. అక్కడి నుంచి టమోటా లోడులు తీసుకురావడానికి సైతం ఇక్కడి వ్యాపారులు భయపడుతున్నారు. ఒకరిద్దరు మినహా హోల్‌సేల్ వ్యాపారులు చాలామంది టమోటా దిగుమతులు నిలిపేసినట్టు చెబుతున్నారు.

● గణనీయంగా తగ్గుతున్న ధరలు

లోకల్ టమోటా అందుకోవడంతో ధరలు రోజురోజుకూ గణనీయంగా పడిపోతున్నాయి. ఇటీవలి కాలంలో ఎన్నడూలేనంతగా బహిరంగ మార్కెట్లో కిలో రూ.20కు టమోటా ధర పతనమైంది. రైతుబజార్లలోనూ కిలో రూ.14లకే దొరుకుతున్నాయి. ఇవి కూడా మంచినాణ్యతతో లభిస్తున్నాయి. నాణ్యత లేని సరుకు అయితే ఇంకాస్త తగ్గించి మరీ అమ్మేస్తున్నారు. లోకల్ నాటు టమోటాలు మార్కెట్లోకి భారీగా రావడంతో వినియోగదారులు వీటినే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోని సీతానగరం మండలం, కడియం మండలంలోని అనేక ప్రాంతాల్లో టమోటాలను పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం పూర్తిగా అనుకూలంగా ఉండడంతో ఇక్కడి నుంచి దిగుబడులు పెరిగాయి. మడికి, రావులపాలెంలంక ప్రాంతాల నుంచి టమోటా భారీగా వస్తోంది.

● టమోటా సూప్‌లు ... నిల్వ పచ్చళ్లు

ధరలు భారీగా తగ్గడం, మంచి నాణ్యత కలిగిన టమోటాలు దొరుకుతుండడంతో చాలామంది గృహిణులు నిల్వపచ్చళ్లతో బిజీగా ఉన్నారు. ఇక పప్పు టమోటా కూరలు చాలామంది మెనూలో చేరింది. మరికొంతమంది టమోటా సూప్‌లను ఆస్వాదిస్తున్నారు. మరోపక్క హోటళ్లు, కర్రీపాయింట్లలోనూ టమోటా కాంబినేషన్‌తో అనేక కూరలు రెడీ చేస్తున్నారు. రైతుబజార్లలోనూ మంచి నాణ్యతతో ఒక్క మచ్చ కూడా లేకుండా లోకల్ టమోటాలు అందుబాటులో లభించడంతో చాలామంది ఎగువ మధ్యతరగతి, ధనిక వర్గాలు కూడా రైతుబజార్లకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితి మరో నెల రోజులపాటు ఉండొచ్చని, ఎండలు పెరిగి వాతావరణం మారితే దిగుబడులు తగ్గి క్రమంగా ధరలు పెరిగే ఛాన్స్ ఉంటుందని వ్యాపారులు, రైతులు చెబుతున్నారు.



జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు మోక్షం

రూ.22.66 కోట్లతో మొత్తం 99 గుంతల పూడ్చివేత లక్ష్యం

ఇప్పటికే 55 పనులు పూర్తి : జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దుర్భరంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఎట్టకేలకు మోక్షం కలుగుతోంది. మొత్తం జిల్లాలో 531.6 కిలోమీటర్ల మేర 99 గుంతలు పూడ్చడానికి రూ.22.66 కోట్లతో పనులు చేపట్టగా, ఇప్పటికే రూ.10.57 కోట్లతో 55 పనులు పూర్తిచేసినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈమేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన జారీచేశారు. ఈనెల 15వ తేదీకి మొత్తం పనులు పూర్తి చేయనున్నట్టు తెలిపారు. రాజానగరం నియోజకవర్గంలో 138.4 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.5.57 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే 83.31 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో 119.246 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.5.88 కోట్ల నిధులు మంజూరుకాగా, ఇప్పటికే 97.330 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయన్నారు. అనపర్తి నియోజకవర్గంలో 82.592 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ3.39 కోట్ల నిధులు మంజూరుకాగా, ఇప్పటికే 71.972 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయన్నారు. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలో 4.695 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.29 లక్షల నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే నూరుశాతం పనులు పూర్తయ్యాయన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో 13.4 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.74 లక్షల నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే 4 కిలోమీటర్ల మేర పూర్తయ్యాయన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో 37.961 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.1.67 కోట్ల నిధులు మంజూరవ్వగా, 26.721 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 51.598 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ2.94 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే 40.048 కిలోమీటర్ల మేర పూర్తయ్యాయన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 82.158 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.2.17 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే 45.400 కిలోమీటర్ల మేర పూర్తయ్యాయని ఆమె తెలిపారు.

వచ్చే నెల 1 నుంచి ఇంటర్, 17 నుంచి పది పరీక్షలు

» ఇంటర్‌కు 51, పదో తరగతికి 134 సెంటర్లు

» పకడ్బందీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మార్చి 1వ తేదీ నుంచి 20 వరకూ ఇంటర్మీడియట్, 17 నుంచి 31 లేదా ఏప్రిల్ 1 వరకూ పదో తరగతి వార్షిక పరీక్షలు ఉంటాయని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఇంటర్ ఉదయం 9 గంటల నుంచి, పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి నిర్వహిస్తారన్నారు. ఈమేరకు సమన్వయ శాఖల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతరం విద్యుత్తు సరఫరా ఉండాలని, సెక్షన్ 144 అమలుచేయాలని, మెడిసిన్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో ఇంటర్ 43,754కి 51, పదో తరగతి 25,723 మంది విద్యార్థులకు 134 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను గంట ముందుగానే అనుమతించడం జరుగుతుందని, ఒక్క నిమిషం ఆలస్యమైనా ప్రవేశం ఉండదని ఆమె వెల్లడించారు. సమావేశంలో అదనపు ఎస్పీ మురళీకృష్ణ, డీఆర్‌వో టి.సీతారామమూర్తి, డీఈవో వాసుదేవరావు, ఆర్‌ఐవో నరసింహం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కి 138 మంది గైర్హాజరు

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 138 మంది విద్యార్థులు బుధవారం గైర్హాజరయ్యాయని ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్‌ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. జిల్లాలో 12 సెంటర్లలో ఈ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించగా మొదటి ఏడాది 727, రెండో ఏడాది విద్యార్థులు 665 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

మద్యం షాపులకు గడువు పెంపు

కొవ్వూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యంషాపులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 8వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు కొవ్వూరు ఎక్సైజ్ సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో చాగల్లు మండలంలో 1, తాళ్లపూడి మండలంలో 1 షాపు ఏర్పాటుచేసుకోవడానికి ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీ (శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. 9న దరఖాస్తుల పరిశీలన, 10న కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడ్రా నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు కుల, స్థానిక ధ్రువీకరణలు సమర్పించాలని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామానాయుడు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోండి

» నగరంలో 17,286 ఓట్లు » ప్రతీ 30 ఓట్లకు ఒకరిని బాధ్యులు చేయండి

» రాజమహేంద్రవరం అర్బన్ చాలా కీలకం » 'పేరాబత్తుల' గెలవాలి

» జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను చాలా సీరియస్‌గా తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం 1వ డివిజన్ పరిధిలోని జాతీయ రహదారి సమీపంలో మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ కార్యాలయం వద్ద బుధవారం రాత్రి సిటీ నియోజకవర్గ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో జరిగిన సమావేశానికి మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ గతంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లోని ఎమ్మెల్సీ ఎన్నికల్లో మనమే గెలిచాం కాబట్టి ఈ దఫా ఎన్నికల్లో బాగా కష్టపడి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తులను గెలిపించాలన్నారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 100 శాతం స్ట్రైకరేట్‌తో ఎలా గెలిచామో.. అదే స్థాయిలో రాజశేఖర్ గెలవాలని అన్నారు. ఉభయగోదావరి జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో అత్యంత ముఖ్యమైన నియోజకవర్గం రాజమహేంద్రవరం అర్బన్ అని, ఇక్కడ 17,286 ఓట్లు ఉన్నాయన్నారు. ఇక్కడ ప్రత్యేక దృష్టిపెట్టాలని, అర్బన్‌లో ఓటర్ల జాబితాలో ఓటర్ల చిరునామాలు వీధుల పేరుతే, గ్రామాల్లో వార్డుల పేరుతోను ఉంటాయి కాబట్టి వాటిని గుర్తించడం సులభతరం అవుతుందన్నారు. రాజమహేంద్రవరంలో ఉన్న ఓటర్ల జాబితాను డివిజన్ల వారీగా సర్దుబాటు చేసుకుని ఒక జాబితా తయారుచేసుకుని 30 ఓట్లకు ఓ బాధ్యుడిని పెట్టుకోవాలన్నారు. ఇలా 600మంది పైబడి బాధ్యులను పెట్టుకోవాలన్నారు. అంతా క్షేత్రస్థాయిలో పనిచేయాలని, ప్రత్యేకమైన శ్రద్ధతో ఎవరి 30 ఓట్లు వాళ్లే చూసుకుంటే సరిపోతుందన్నారు. ఈ ఓట్లలో పాజిటివ్, నెగిటివ్ ఓట్లు గుర్తించుకోవాలని, పాజిటివ్ ఓట్లు 100 శాతం పోల్ అయ్యేవిధంగా కృషి చేయాలన్నారు. నెగిటివ్‌గా ఉన్న ఓటర్లకు అవగాహన కల్పించాలని, అలాగే బ్యాలెట్‌లో ఓటు వేసేటప్పుడు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, వరుస నెంబరులో పేరాబత్తుల రాజశేఖర్ పేరు ఎదురుగా ఉన్న గడిలో 1 నెంబరు వేయాలని చెప్పారు. అది కూడా పోలింగ్ బూత్‌లో సిబ్బంది ఇచ్చే పెన్నునే వినియోగించాలని, గడిలో నెంబరు మాత్రమే వేయాలని తెలిపారు. రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సమర్థవంతమైన నాయకుడని, ఆయన నేతృత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలిసికట్టుగా పేరాబత్తులను గెలిపించాలన్నారు. ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల గెలుపే లక్ష్యంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. గత ఎనిమిది నెలల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుతోనే పేరాబత్తుల గెలుస్తారని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, పరిశీలకులు బోళ్ల వెంకటకృష్ణ ప్రసాద్, మాజీ మంత్రి కేఎస్ జవహర్, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు మరో నామినేషన్

ఏలూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బుధవారం ఒక నామినేషన్ దాఖలైంది. ఇప్పటికి వరకు మొత్తం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు జిల్లా నుంచి భీమడోలుకు చెందిన గుండుమోలు బాలాజీ బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ నెల 10 వరకు మాత్రమే నామినేషన్ల దాఖలుకు గడువు ఉంది. దీంతో ఈనెల 6, 7, 10 తేదీలే ఇక అభ్యర్థులకు మిగిలాయి. 8, 9 తేదీలు సెలవు దినాలు కావడంతో నామినేషన్ల దాఖలకు ఆ మూడు రోజులే మిగిలి ఉన్నాయి. ఇటు ప్రధాన పార్టీల మద్దతు ఉన్న అభ్యర్థులు ఇంకా నామినేషన్లు దాఖలు చేయలేదు. వారు నామినేషన్లు వేస్తే రాజకీయ వేడి రగలనుంది.

జిల్లాలో 32 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం

జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు



ఎంఆర్‌పాలెంలో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

కడియం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 32వేల ఎకరాల్లో 28 వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నారని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. బుధవారం మాధవరాయుడుపాలెంలో సర్పంచ్ అన్నందేవుల చంటి సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ సాగును మాధవరావు సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంటి తాను కొన్నేళ్లుగా ప్రకృతి వ్యవసాయ విధానాన్ని సాగు చేయడంతోపాటు ఈ ప్రాంత రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ ఎటువంటి పురుగుమందులు, ఎరువులు లేకుండా ఘనామృతం, జీవామృతాలను తయారుచేసి వాటి ద్వారా పండించే ప్రకృతి వ్యవసాయ విధానంతో రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడానికి వీలుందన్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లాలో 32 వేల ఎకరాల్లో సాగుచేస్తుండగా, కడియం మండలంలో 1800 మంది రైతులు 2800 ఎకరాల్లో సాగు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా ప్రకృతి వ్యవసాయానికి కషాయాలను పిచికారీ చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు కొత్త అగ్రిస్టాక్ రిజిస్ట్రేషన్లు

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన అగ్రిస్టాక్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో రైతులకు రిజిస్ట్రేషన్ ఎలా చేస్తున్నారో అనే విషయాన్ని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు బుధవారం రూరల్ మండలం రాజవోలులో పరిశీలించారు. రిజిస్ట్రేషన్ మరింత సులభతరంగా చేసేందుకు సిబ్బందికి సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాలకు రిజిస్ట్రేషన్ కచ్చితంగా రైతులు చేయించుకోవాలని, రైతులు రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌కార్డు, కొత్తగా వచ్చిన ఎల్పీ నెంబర్‌తో కూడిన 1బీ/పాస్‌బుక్ జిరాక్స్, రేషన్‌కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నెంబర్ తీసుకెళ్లాలన్నారు. రిజిస్ట్రేషన్ అయిన తరువాత 21 నంబర్ల ఐడీ రైతు మొబైల్ నెంబర్‌కు మెసేజ్ వస్తుందని, పీఎం కిసాన్‌కి ఈ ఐడీతోనే లబ్ధి ఉంటుందన్నారు.



ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) తూర్పుగోదావరి జిల్లా 2025 క్యాలెండర్‌ను కలెక్టర్ ప్రశాంతి ఆవిష్కరించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ, జిల్లాకార్యదర్శి సీహెచ్‌ఎస్ విల్సన్‌పాల్, జిల్లా ఉపాధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, పి.రవికుమార్, రాజమహేంద్రవరం నగరశాఖ అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు ఏ శ్రీనివాసరావు, లక్ష్మీప్రసన్న, అగ్రికల్చర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నేతలు హమీద్, మహ్మద్ ఖాజామొహిద్దీన్ పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాల అభివృద్ధికి కృషి

● ఏపీఎస్ఐడీసీ ఎండీ శ్రీనివాస్

కొవ్వూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి పూర్వవైభవం తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీఎస్ఐడీసీ ఎండీ వై.శ్రీనివాస్ అన్నారు. బుధవారం కొవ్వూరు మండలం కుమారదేవం ఎత్తిపోతల పథకాన్ని ఏపీఎస్ఐడీసీ అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఈఈ ఆదిశేషారావు, డీఈ దుర్గా గురవయ్యలు మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గం పరిధిలోని 5 ఎత్తిపోతల పథకాల మరమ్మతు లకు రూ.20కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంచేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశామన్నారు. అత్యవసరంగా రూ.5కోట్లు మంజూరు చేయాలని కోరామని ఎండీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎండీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల పోలవరం పర్యటనకు వెళ్లిన ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సాయిప్రసాద్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలను పరిశీలించాలని ఆదేశించారని, దానిలో భాగంగా బుధవారం కొవ్వూరు మండలం కుమారదేవం, తాళ్ళపూడి మండలం పైడిమెట్ట, వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. జూలై నాటికి నిధులు మంజూరు కానున్నాయని రైతులకు తెలిపారు. ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి పూర్వ వైభవం తీసుకురావడానికి అన్నిచర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఐడీసీ ఈఈ ఆదిశేషారావు, డీఈ దుర్గాగురవయ్య, టీడీపీ కొవ్వూరు మండలం అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, కుమారదేవం ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు సురేష్, రైతులు పాల్గొన్నారు.


కుమారదేవం ఎత్తిపోతల పథకంలో రైతులతో మాట్లాడుతున్న ఏపీఎస్ఐడీసీ ఎండీ శ్రీనివాస్

పోలవరం కుడికాల్వపై వంతెనలు ఏర్పాటు చేయాలి

దేవరపల్లి, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి పల్లంట్ల, దేవరపల్లి లక్ష్మీపురం మార్గంలో పోలవరం కుడికాల్వపై వంతెనలు ఏర్పాటుచేయాలని మాజీ జడ్పీటీసీ, టీడీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కొయ్యలమూడి సుధారాణి మంత్రి నిమ్మల రామానాయుడిని కోరారు. ఆమె మాట్లాడుతూ దేవరపల్లి పల్లంట్ల, తాడిపూడి పోలవరం కాల్వపై వంతెన ఏర్పాటు చేశారని ఆ వంతెన ఇరుకుగా ఉండటంతో ఒకేసారి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని గతంలో టీడీపీ హయాంలోనే అప్పటి ఇరిగేషన్ మంత్రి ఈ పోలవరం కాల్వపై వంతెన నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాలనలో దాన్ని పట్టిం చుకోలేదని ఇప్పుడు ఆ వంతెన నిర్మాణం చేయాలని కోరారు. అలాగే దేవరపల్లి-లక్ష్మీపురం తాడిపూడి మార్గంలో తాడిపూడికాల్వపై వంతెన నిర్మాణం చేసి పోలవరం కాల్వపై వంతెన నిర్మాణం చేయక పోవడంతో రాకపోకలు లేక రెండు గ్రామాల మధ్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈవంతెన నిర్మాణాలు చేపట్టాలని మంత్రి రామానాయుడిని కోరారు. మంత్రి రామానాయుడు స్పందిస్తూ ఈ నిర్మాణాలను పరిశీలిస్తామన్నారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు చినబాబు పాల్గొన్నారు.


మంత్రి రామానాయుడిని పోలవరం కాల్వపై వంతెన నిర్మాణం చేయాలని కోరుతున్న మాజీ జడ్పీటీసీ సుధారాణి, చినబాబు

'మనిషి ప్రశాంతతే అన్ని పనులకు మూలం'

కొవ్వూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మనిషి ప్రశాంతతే అన్నిపనులకు మూలమని కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వై.వి.వి.ఎస్. కుమార్ అన్నారు. కొవ్వూరు ఆర్టీసీ డిపోలో బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలలో యాక్సిడెంటులు చేసిన డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ అం దించారు. డిపో మేనేజర్ కుమార్ మాట్లాడుతూ డ్రైవర్లు విధులకు వచ్చే సమయంలో వారిపై ఏ విధమైన ఒత్తిడికి గురిచేయకుండా ప్రశాంతంగా చిరునవ్వుతో మంచి ఆలోచనలతో పంపించాలన్నారు. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ లేకుండా పిరియాడికల్ చెకప్స్ చేయించుకుంటూ ఉభయులు శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి మనిషి ఓర్పు, సహనంతో మంచి ఆలోచనలతో ఉంటే కుటుంబం, సమాజం అలానే పనిచేసే సంస్థలన్నీ బాగుంటాయన్నారు. మనిషి ప్రశాంతతే అన్ని పనులకు మూలమని, మంచిగా విధులు నిర్వహిస్తే అంతా మంచే జరుగుతుందన్నారు. కౌన్సిలింగ్ అనంతరం తుమ్మిడి బ్రదర్స్ సౌజన్యంతో చీర, తాంబూలం అందించి ఆర్టీసీ ఆడపడుచులుగా గౌరవిస్తామన్నారు.


డ్రైవర్ కుటుంబ సభ్యులకు చీర, తాంబూలం అందిస్తున్న డిపో మేనేజర్ కుమార్

మట్టి తరలిస్తున్న లారీల సీజ్

గోపాలపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రి సమయాల్లో మట్టిని తరలిస్తున్న నాలుగు లారీలు, రెండు జేసీబీ యంత్రాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గుడిగూడెం సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న నాలుగు లారీలను, రెండు జేసీబీ యంత్రాలను సీజ్ చేసినట్లు తెలిపారు. వాటిని గనుల శాఖాధికారులకు అప్పగించనున్నామన్నారు.


గోపాలపురం పోలీస్‌స్టేషన్ వద్ద స్వాధీనం చేసుకున్న మట్టిలారీలు

రైతులకు అందుబాటులో యూరియా

గోపాలపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలో సొసైటీ పరిధిలో యూరియా రైతులకు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయాధికారి రాజారావు తెలిపారు. మండలంలో రబీ సీజన్‌లో భాగంగా 14వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు, 9500 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నా యన్నారు. వీటిలో 3600మెట్రిక్ టన్నుల యూరియా అవసర మవుతుందని అంచనావేసి యూరియాను మూడు ప్రైవేటు డీలర్లు, రెండు డీసీఎంఎస్‌లు, ఏడు సొసైటీల్లో రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. దీంతో యూరియా కొరత తీరినట్లు అయ్యిందన్నారు.


యూరియా బస్తాలను దిగుమతి చేస్తున్న దృశ్యం

డ్వాక్రా మహిళల అప్పుల చెల్లింపులు రికవరీ చేయాలి

● డీఆర్‌డీఏ పీడీ మూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ మూర్తి

గోపాలపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలు తీసుకున్న అప్పుల చెల్లింపులు పూర్తిస్థాయిలో రికవరీ జరిగేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్. మూర్తి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకర్ల రామతులసి అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా గోపాలపురం మండలంలో లక్షలాది రూపాయలు అప్పులు తీసుకున్నవారు చెల్లింపు విషయం లో మాత్రం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారని అన్నారు. దీంతో మండల సమాఖ్యలో ఆర్థికలావాదేవీలు కుంటుపడ్డాయన్నారు. అప్పు తీసుకున్న వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం తీసుకున్న అప్పుతో పాటు వడ్డీతో సహవసూలు చేస్తామన్నారు. మండల వ్యాప్తంగా సీఐఎఫ్ (కమ్యూనిటీ ఇన్‌వెస్ట్ మెంట్ ఫండ్) రూ.27లక్షల 88,130లు, వీవోఆర్ఎఫ్ (విలేజ్ ఆర్గనైజేషన్ ఫండ్) రూ.6,87,759లు స్త్రీనిధిలో రూ.2,70,000లు అప్పులు కొంతకాలంగా ముగ్గి పోయాయని అన్నారు. వీటిని ఆర్‌అండ్‌ఆర్ యాక్ట్‌ను ఉపయోగించి సమాఖ్య నుంచి తీసుకున్న ప్రతీ రూపాయిని తిరిగి రికవరీ చేసేలా చూసే బాధ్యత మండల సమాఖ్యదేనన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రతీ ఇంటికి సబ్సిడీ రుణంతో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ప్రతీ ఇంటికి సోలార్ సిస్టమ్ ద్వారా విద్యుత్ ఉత్పాదక పథకాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. వీటితోపాటు మహిళలను ఆర్థిక స్వావలంభన దిశగా బలోపేతం చేయడానికి నారీశక్తి పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 40వేల మందికి చిరు వ్యాపారాలకు బ్యాంకుతో సమన్వయం చేసుకుని రుణాలు అందిస్తామన్నారు. అసంఘటిత కార్మికులకు ఉచిత బీమా పథకంలో భాగంగా ఈశ్రంయాప్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ పథకంలో భాగంగా 18సంవత్సరాలు పైబడి 59సంవత్సరాలలోపు ఉన్న ప్రతీ ఒక్కరు ఆధార్‌కార్డుకు లింకైన ఫోన్ నెంబర్‌తో పాటు తమ వ్యక్తిగత బ్యాంకుఖాతాను ఈశ్రం యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా గోపాలపురం, పోత వరం, కోరుకొండ, అనపర్తి, మండలాలు రికవరీ విషయంలో పూర్తిగా వెనుకబడే ఉన్నాయన్నారు. వీటితోపాటు గ్రామ స్థాయి నుంచి మండలస్థాయి వరకు ప్రతీనెలా 5న గ్రామసమాఖ్య సమావేశాలు, మండల సమాఖ్య సమావేశాలు విధిగా నిర్వహిం చాలన్నారు. సమావేశాల్లో ప్రగతితోపాటు పురోగతి అజెండాగా చర్చించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రోజ్‌మాణిక్యం, సీసీలు, సీఏలు, స్వయం సహాయ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు అవగాహన

తాళ్లపూడి: మండలంలోని రావూరుపాడు రైతు సేవా కేంద్రంలో మహిళా రైతులకు సమీకృత వ్యవసాయ పద్ధతులపై సంబంధిత శాఖ అధికారుల ఆధ్వర్యంలో మహిళా రైతు సహకార సంఘం అధ్యక్షురాలు బండారు నాగకుమారి అధ్యక్షతన బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీఎస్ మూర్తి మాటాడుతూ రైతు వ్యవసాయ పంటలతో పాటు ఉద్యానవన పంటలు, మత్స్య సంపదను పెంచే పంటలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖా, ఆర్టీ కల్చరల్, ఉద్యానవన శాఖాధి కారులు పి.కృష్ణవేణి, వల్లి హేమంత్, తాళ్లపూడి ఏపీఎం మంగాయమ్మ, ఫార్మా మైత్రీలు పాల్గొన్నారు.

డెల్టా కాలువలకు నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): రబీ అవసరాల కోసం డెల్టా కాలువలకు నీటి విడుదల ను పెంచి 8550 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాప్రధాన పంటకాలువకు 2450 క్యూసెక్కులు, మధ్యడెల్టా కాలువకు 1700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టా కాలువకు 4400క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత 8562 క్యూసెక్కులు, ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.65 అడుగులుగా నమోదైంది.

వైసీపీ హయాంలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కు..

● మంత్రి నిమ్మల రామానాయుడు


పెరవలిలో జరిగిన సమావేశంలో కూటమి నాయకుల సమైక్య నినాదం

పెరవలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హాయాంలో రాష్ట్ర అభివృద్ధి 20 సంవత్సరాలు వెనక్కు వెళ్లిందని, రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టిందేకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తుందని రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి, తూర్పుగోదావరిజిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. కానూరులో బుధవారం ఉమ్మడి తూర్పుపశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఎన్నికల ప్రచారంలో భాగంగా నిడదవోలు నియోజవర్గస్థాయి కూటమి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల ముందు ప్రకటించిన అన్ని హామీలను నెరవేర్చడానికి తీవ్రంగా శ్రమిస్తున్నట్లు తెలిపారు. పర్యాటకశాఖామంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయాంలో వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలను భరించ లేక, గత ఎన్నికల్లో ఆ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించారని, ఓటమిని తట్టుకోలేని వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై అవాకులుచవాకులు పేలుతున్నట్లు దుయ్యబట్టారు. నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలవలే ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కెఎస్ జవహర్, ఎమ్మెల్సీ అబ్జర్వర్ బూర్లగడ్డ వేదవ్యాస్, డీవీవీ సత్యనారాయణ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరకుల సత్యప్రభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, పెన్మత్స సుబ్రహ్మణ్యవర్మ, మూడు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలలో విజయం సాధించాలి

కొవ్వూరు: ఓటరుగా నమోదైన ప్రతిఒక్కరినీ బూత్‌వద్దకు తీసుకువెళ్లి ఓటుగా మలుచుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి నిమ్మల మాట్లాడుతూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో కూటమి నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి దశ, దిశ నిర్దేశిస్తామన్నారు. ప్రతి 30మంది ఓటర్లకు ఒక నాయకుడికి బాధ్య త అప్పగించే కార్యక్రమం ఎంతవరకు వచ్చింది పరిశీలిస్తామన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను ఏన్డీఏ కూటమి ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటి ఎన్నికలు ఈ 7 నెలల పరిపాలనకు రిఫరెండంగా భావించాలన్నారు. రాబోయో స్థానిక ఎన్నికలలో గెలుపొందాలంటే ఈ ఎన్నికలలో విజయం సాధించాలన్నారు. కూటమి ప్రభుత్వం బలపర్చిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను అత్యధిక ఓట్లతో విజయం సాధించేలా కృషిచేయాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులంతా కలిసికట్టుగా విజయానికి కృషి చేయాలన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గం వ్యవసాయ రంగంపై ఆధారపడిన ప్రాంతం. గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని, కాలువలను నిర్లక్ష్యం చేయడంతో కాలువలు పూడుకుపోయి, పిచ్చిమొక్కలు, గుర్రపుడెక్క పెరిగిపోయి ఇబ్బందికరంగా మారిందన్నారు. కొవ్వాడకాలువ పూడుకుపోయి చిన్న వర్షానికి పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయి. పంటకాలువలు పూర్తిగా పూడికలు తీయించాలన్నారు. 5 ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించి పూర్తిగా మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, నియోజకవర్గ పరిశీలకులు గొర్రెల శ్రీధర్, కోట్ని బాలాజీ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, బీజేపీ నాయకులు ఎం. ఆంజనేయులు, దేగల సునీత, జనసేన నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, సుంకర సత్తిబాబు, టీడీపీ నాయకులు సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, నామాన పరమేష్, మద్దిపాటి సత్య నారాయణ, చావా శ్రీనివాసరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.


కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

కూటమి అభ్యర్థిని గెలిపించాలి

ఉండ్రాజవరం: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించాలని నియోజవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. బుధవారం వేలివెన్నులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శేషారావు ఓటర్లను కోరారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు, గ్రామ ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు బూరుగుపల్లి అచ్యుతరామారావు, చిట్టూరి సూర్యానారాయణ, వెలిచేటి ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవరపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు నాయ కులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేవరపల్లి కరుటూరి ఫంక్షన్ హాలులో గోపాలపురం నియోజకవర్గంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలతో బుధవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అధ్యక్షతన జరిగింది. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి ఏడునెలల కాలంలో ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. టీడీపీ టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ విజయానికి అందరూ సమిష్టిగా కృషిచేయాలన్నారు. అనంతరం మంత్రి నిమ్మలను జనసేన పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ సువర్ణరాజు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఘనంగా సత్కరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు, అండ్రూ అనీల్, లంకా సత్యనారాయణ, రొంగల సత్యనారాయణ, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకు కూరలతోనే ఆరోగ్యం : సీడీపీవో మమ్మీ


చాగల్లులో ఆకు కూరలు గురించి తెలియజేస్తున్న సీడీపీవో మమ్మీ

చాగల్లు, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి): స్థానిక అంగన్‌వాడి కేంద్రం 64లో పోషణ వాటిక కార్యక్రమంలో భాగంగా బాలింతలు, గర్భిణీ స్త్రీలకు ఆకుకూరలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీడీపీవో డి మమ్మీ మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు ఆరోగ్యంకి మంచిదన్నారు మన ఆహారంలో పండ్లు, గుడ్లు, పాలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. మన పెరట్లో పండించిన ఆకుకూరలే మనకు ఆరోగ్యం ఇస్తాయని అన్నారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆకుకూరల పంపిణీ

ఉండ్రాజవరం: ఆకు కూరలు వలన విటమిన్లు లభిస్తాయని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్ చెప్పారు. బుధవారం కె.సావరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా పండించిన ఆకు కూరలను డాక్టర్ ప్రసాద్ గర్భిణులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు మంచి పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణులు తీసుకునే ఆహారం గర్భంలో ఉన్న శిశువుతోపాటు మహిళలకు సరిపోయే పోషకాహారం తీసుకోవాలని డాక్టర్ ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె.నాగమణి, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల సమావేశం

తాళ్లపూడి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశం బుధవారం తాళ్లపూడి జెడ్పీ ఉన్నతపాఠశాల ఆవరణలో మండలాధ్యక్షులు బారణాల శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ కుటుంబ సభ్యుల సంక్షేమ పథకం గురించి వివరించి సభ్యులందరినీ ఈ పథకంలో చేర్పించాలని తెలిపారు. రాజమహేంద్రవరంలో నిర్మిస్తున్న యూటీఎఫ్ జిల్లా శాఖాభవన నిర్మాణానికి ఉపాధ్యాయుడు చోడిపిండి శ్రీనివాస్ 25వేల రూపాల విరాళాన్ని మండలాధ్యక్షులు శంకరానికి అందించారు. అనంతరం ఇటీవల మృతిచెందిన ఉపాధ్యాయులు తైలం సాయి చంద్ర, షేక్ మీరావలిలకు సంతాపం వ్యక్తం చేసారు.కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా మహా సౌరయాగం


ఆచార్య దోర్బల ప్రభాకరశర్మను సత్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ అనపర్తి శివరామకృష్ణ దంపతులు

కొవ్వూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలోని శ్రీనివాస స్నానఘట్టంలో ప్రకృతి రావణబ్రహ్మ శివాలయంలో జరుగుతున్న మహా సౌరయాగం వైభవంగా కొనసాగుతుంది. ఆలయ కమిటీ చైర్మన్ అనపర్తి శివరామకృష్ణ పర్యవేక్షణలో సూర్య ఉపాసకులు విక్రమాధిత్య ఆధ్వర్యంలో బుధవారం సూర్య భగవానుడికి విశేష పూజలు చేశారు. సౌరయాగంలో పాల్గొన్న ఆచార్య దోర్బల ప్రభాకరశర్మ, జి.బి.వి.సుబ్రహ్మణ్యంలను ఆలయ కమిటీ చైర్మన్ అనపర్తి శివరామకృష్ణ దంపతులు సత్కరించారు. అనంతరం పశివేదల గ్రామానికి చెందిన భక్తులచే భజనలు చేశారు. రాత్రి దక్షయజ్ఞం బుర్రకథను నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

మహాలింగేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

దేవరపల్లి: దేవరపల్లి మండలం గౌరీపట్నం గౌరీసమేత మహాలింగేశ్వరస్వామి పరివారదేవతలు ధ్వజస్తంభ ప్రతిష్టాపన బుధవారం జరిగింది. వేదపండితులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం వేదపారాయణ, గో పూజ, గవ్యాంతపూజలు, నిత్యారాధనలు, నిత్య హోమాలు, నిరాజనము, నిర్వహించారు. సా యంత్రం గణపతిపూజ, పుణ్యాహవాసనం, మహనంది విశేష అభిషేకం, హోమాలు, కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు అందజేశారు. మాజీ మంత్రివర్యులు తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, భక్తులు, మహోత్సవాల్లో పాల్గొన్నారు.


గౌరీపట్నం మహాలింగేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

'భీమోలు పట్టాదారులకు న్యాయం జరిగేలా పోరాటం చేస్తాం'

గోపాలపురం, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): భీమోలు పట్టదారులకు న్యాయం జరిగే వరకు దశలవారీగా పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. మండలంలోని భీమోలులో ఈనెల 12న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పరిశీలనకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాదారులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను పరిశీలించడానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ భీమోలు రానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఖాతాదారులు పాల్గొన్నారు.


భీమోలులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం కార్యదర్శి తాటిపాక మధు, తదితరులు

దొంగతనాల కేసుల్లో నిందితుడి అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు వస్తువులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దొంగతనాల్లో నిందితుడిగా ఉన్న చుక్కల బాబిని పెద్దేవం రావూరుపాడు రహదారి బస్టాండ్ వద్ద అరెస్టు చేసినట్లు తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గతనెల 30వ తేదీన పెద్దేవం గ్రామం నుంచి తిరుగుడుమెట్ట గ్రామం వెళ్లేదారిలో గోచిపాతల శిరీష యథావిధిగా పని నిమిత్తం రాజమహేంద్ర వరం వెల్లగా ఆదేరోజు సాయంత్రం ఆమె కుమారుడు ఇంటికి వచ్చేటప్పటికి ఇంటి తాళం పగుల గొట్టి ఉండటంతో తన తల్లికి ఫోన్‌చేసి చెప్పగా ఆమె వచ్చి పరిశీలించి ఇంట్లో దొంగతనం జరిగిందని గ్రహించి తన ఇంట్లో 9కాసుల బంగారు వస్తువులు, వెండి, కొంత నగదు అపహరణకు గుర య్యాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు పర్యవేక్షణలో సీసీఎస్ ఎస్ఐ రవీంద్రతో కలిసి ఎస్ఐ రామకృష్ణలు కేసును ఛేదించి గోపాలపురం మండలం భీమోలు గ్రామా నికి చెందిన చుక్కల బాబి రావూరుపాడు రహదారి బస్టాండ్‌వద్ద అనుమానాస్ప దంగా సంచరిస్తుండడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా అతనివద్ద నుంచి చోరీకి సంబంధించిన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకుని అతడిని కొవ్వూరు కోర్టు హాజరుపరిచినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఎండీయూ ఆపరేటర్లపై రాజకీయ కక్షలు ఆపాలి


తహసీల్దార్ కార్యాలయంవద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎండీయూ ఆపరేటర్లపై రాజకీయ కక్షలు నిలుపుదల చేయాలని కోరుతూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కొవ్వూరు మండలం దొమ్మేరు ఎండీయూ ఆపరేటర్ బి. రవికుమార్‌కు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా విధుల నుంచి తొలగించడంపై బుధవారం కొవ్వూరు తహసీల్దార్ కార్యాలయంవద్ద నిరసన ప్రదర్శన నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. రవికుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వెహికల్ మంజూరైందని, గత నాలుగు సంవత్సరాలుగా వాహనానికి ఈఎంఐ కడుతూ రేషన్ డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నానన్నారు. ఇప్పటివరకు ఎటువంటి రిమార్కు లేకుండా రేషన్ అందించామన్నారు. చాలీచాలని జీతాలతో కుటంబాన్ని పోషించుకుంటున్నామని, రాత్రికి రాత్రి రాజకీయ వత్తిళ్ల కారణంగా తనను తొలగించి కొత్త వ్యక్తిని నియమించడం సరికాదన్నారు. తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

చాగల్లు, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంటర్‌లోని శ్రీకామాక్షి అమ్మవారు, శ్రీగోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయ 50వ వార్షిక మహోత్సవం ఈనె ల 8న జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. స్వామివారు అమ్మవార్ల కల్యాణం వేడుకగా జరుగుతుందని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బ్రహ్మంగారి 8వ తరం మునిమనవడు వీరభద్రస్వాములు సతీసమేతంగా పాల్గొంటారని చెప్పారు. భక్తులు ఈ కార్యక్రమంను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

వివాహిత మహిళ అదృశ్యం

చాగల్లు, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలటూరుకు చెందిన వివాహిత మహిళ ఆల పాటి రామలక్ష్మి రెండురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు భర్త శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని ఆయన కోరారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్ స్క్రీన్1	సంక్రాంతికి వస్తున్నాం
వై.స్క్రీన్2	ఏజెంట్ గయ్ 001
అనన్య	మదగజరాజు
నిడదవోలు	
వీ మ్యాక్స్	మదగజరాజు
రాధాకృష్ణ	సంక్రాంతికి వస్తున్నాం
శ్రీగణపతి	డాకు మహరాజ్
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్	గేమ్ ఛేంజర్
త్రినాథ్	డాకూ మహరాజ్